





రొయ్యల సాగు
సూర్యలంక బీచ్
రేపల్లె వద్ద కాల్వల పరిస్థితి

ప్చ..నిరాశే


బాపట్ల జిల్లాకు దక్కని ప్రాధాన్యం

బాపట్ల జిల్లాగా ఆవిర్భవించి వచ్చే ఏప్రిల్‌కు రెండేళ్లు పూర్తి అవుతుంది. పలు కార్యాలయాల్లో మౌలిక వసతుల కొరత వెంటాడుతూనే ఉంది. జిల్లా అయితే ఈ ప్రాంతం పారిశ్రామికంగా కొత్త పుంతలు తొక్కుతుందని ఆశలు పెట్టుకున్న నిరుద్యోగుల ఆశ రెండేళ్లుగా నెరవేరలేదు. జిల్లా ఆవిర్భవించాక గతేడాది ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కుతుందని ఆశపడిని ప్రజలకు నిరాశే మిగలగా, బుధవారం ప్రవేశపెట్టిన మలి బడ్జెట్ సైతం జిల్లావాసులకు నిరాశనే మిగిల్చింది. బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాకు ఇతోధికంగా నిధులు రాబట్టడంలో పాలకపార్టీ నేతల కృషి నామమాత్రంగా కూడా లేకపోవడంతో వారు ఇచ్చిందే దక్కుదల, వచ్చిందే ప్రాప్తం అన్నట్లుగా ప్రజల పరిస్థితి తయారైంది. సమీకృత కలెక్టరేట్ ప్రతిపాదనలను తొలినాళ్లలో రూపొందించారు. గతేడాది బడ్జెట్‌లో అందుకు సంబంధించి నిధులేవీ కేటాయించకపోవడంతో వాటిని అటకెక్కించారు. ప్రస్తుత బడ్జెట్‌లో అయినా వాటి ఊసు ఉంటుందనుకుంటే అదేమీ కనడడలేదు. జిల్లా పారిశ్రామికంగా ఎదగ డానికి అవకాశం ఉన్న రంగం ఆక్వాపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపు తోంది. పర్చూరు ప్రాంతంలో ఎక్కువగా మిర్చి, డెల్టా ప్రాంతంలో వరి రైతులను ఆదుకోవడానికి ప్రత్యేక కేటాయింపులేవి బడ్జెట్ పద్దులో కనబడలేదు. గుంటూరు ఛానల్ విస్తరణకు రైతు సంఘాలు ఏళ్ల తరబడి పోరాటం చేస్తూనే ఉన్నా కేటాయింపులో దాని ఊసే కరువైంది. జిల్లాలో కొరిశపాడు ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయిస్తున్నట్లు గత బడ్జెట్‌లో పొందుపరిచారు. అయితే ఇంతవరకు పైసా విదిల్చిన పాపాన పోలేదు. ఈ ఏడాది పద్దులోనూ ఆ పథకానికి నిరాశే ఎదురైంది. దాదాపు 5,000 ఎకరాలకు నీరందించే భవనాసి రిజర్వాయర్ పనులకు సంబంధించి కూడా బడ్జెట్‌లో చోటు దక్కలేదు. కాల్వల్లో తూటుకాడ, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో నీరు వదిలినప్పటికీ చివరి ఆయకట్టుకు నీరు చేరడం గగనమైపోయినా పాలకులు పట్టించుకోలేదని బడ్జెట్‌తో అర్థమవుతుంది. గతంలో కలెక్టర్ విజయకృష్ణన్ పర్యాటకరంగం అభివృద్ధికి బాపట్లలో మంచి స్కోప్ ఉందని గుర్తించి 4 కోట్లతో ప్రతి పాదనలు పంపారు. ఆ కొద్ది మొత్తం విడుదలకు కూడా ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడంతో ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. కనీసం ఈ బడ్జెట్‌లో అయినా ఎంతోకొంత వాటా దక్కుతుందను కుంటే ఇక్కడా నిరాశే ఎదురైంది.



- పునాదుల్లోనే నిలిచిపోయిన బాపట్ల మెడికల్ కళాశాల

- అద్దంకి: చిల్లచెట్లతో మధ్యలో శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం



ఎన్నికలకు ముందు బడ్జెట్.. నిధులు వరద.. ప్రత్యేక ప్రాజెక్టుల ప్రకటన.. పాత పనులకు ప్రత్యేక కేటాయింపులు.. అని ఆశించిన వారికి బుగ్గన బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రస్తావన లేకుండానే బడ్జెట్ ప్రవేశ పెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి ఏ ఒక్క ప్రాజెక్టు కు ఎలాంటి కేటాయింపులు జరపలేదు. గంటకు పైగా సాగిన ఆయన సుదీర్ఘ ప్రసంగంలో ఒకే ఒక్క చోట నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని మాత్రం ప్రస్తావించారు. అంతకు మించి ఎక్కడా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పేరు ప్రస్తావనకు రాలేదు.

- బుగ్గన బడ్జెట్‌లో మొండిచెయి
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు నిధులు నై
- బడ్జెట్ కేటాయింపుల్లో దక్కని ప్రాధాన్యం
- కీలక రంగాలకు నిధుల ఊసే లేకుండా బడ్జెట్
- పల్నాడు, బాపట్ల జిల్లాలపై రెండో ఏడూ శీతకన్నే



గుంటూరు ఛానల్

నరసరావుపేట, గుంటూరు, బాపట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ, పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ పథకం, నల్లమడ డ్రెయిన్ మోడర్ నైజేషన్, బుగ్గవాగు రిజర్వాయర్, కృష్ణా పశ్చిమ డెల్టా, సాగర్ కుడికాలువ ప్రాజెక్టుల పనులకు సంబంధించి నిధుల కేటా యింపు జరపలేదు. బుగ్గన బడ్జెట్‌తో జిల్లా ప్రజానీకానికి ఒరి గేది ఏమి లేదని స్పష్టమైంది. ప్రధానంగా భారీ నీటిపారుదల శాఖకు సంబంధించి కీలకమైన ప్రాజెక్టులు ఉన్నాయి. గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణకు సంబంధించి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే టెండర్లు జరిగాయి. ఈ ఐదేళ్లలో భూసేకరణ ప్రక్రియ నోటిఫికేషన్ల వరకు మాత్రమే వైసీపీ తీసుకొచ్చిందంటే నీటిపారుదల రంగంపై ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తేటతెల్లం అవుతున్నది. పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ పథకం పనులను వైసీపీ ప్రభుత్వం వస్తూనే నిలిపేసింది. వైసీపీ ప్రభుత్వం డాక్టర్ వైఎస్ఆర్ పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ పథకం అంటూ పేరు మార్చి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిధులు కేటాయిస్తున్నట్లు బిల్డప్ ఇచ్చింది. తీరా చేతులెత్తేయడంతో నిర్మాణ సంస్థలు కూడా వెనకడుగు వేసి యంత్రపరికరా లన్నింటినీ వేరే ప్రాంతానికి తరలించాయి. నాగార్జున సాగర్, కృష్ణా పశ్చిమ డెల్టా కాలువలపై ఈ ఐదేళ్ల లో నామమాత్రంగానే పనులు జరిగాయి. టీడీపీ హయాంలో అమరావతి నూతన రాజధాని నిర్మాణానికి ఏటా బడ్జెట్‌లో కేటాయింపులు జరిపేది. వైసీపీ ప్రభుత్వం అమరావతి అనే పదాన్ని తొలగించి నూతన రాజధాని అని పెట్టి కేటాయింపులు జరిపినా ఇక్కడ ఎలాంటి నిధులు ఖర్చు పెట్టలేదు. బాపట్ల, గురజాల నియోజకవర్గాల్లో నిర్మాణం జరుగుతున్న మెడికల్ కాలేజీల పనులు ముందుకు సాగాలంటే ఈ బడ్జెట్‌లో భారీగా నిధుల కేటాయింపు జరగాల్సి ఉన్నది. అమరావతి - అనంతపురం గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రాజెక్టుని కూడా బుట్ట దాఖలు చేసింది.



పిడుగురాళ్ల: బ్రాహ్మణపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల




నిజాంపట్నం హార్బర్



గోదావరి జలాల తరలింపు పథకంకు నకరికల్లు వద్ద నాటి సీఎం చంద్రబాబు నాయుడు అవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

చిత్తశుద్ధి కరువు

పల్నాడు జిల్లాలోని నీటి పథకాలపై ప్రభుత్వం మొండిచెయి చూపింది. నీటి పథకాలను పూర్తి చేయడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బుగ్గన బడ్జెట్ తెలియజేసింది. పల్నాడు జిల్లాగా ఆవిర్భవించి వచ్చే ఏప్రిల్‌కు రెండేళ్లు పూర్తి అవుతుండగా ఈ బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు లేవు. దీంతో తొలి బడ్జెట్‌లాగే ఈ ఏడూ జిల్లా వాసులకు నిరాశనే మిగిల్చింది. తాగు, సాగునీటి పథకాలకు నిధుల కేటాయింపులు లేదు. వాటర్ గ్రిడ్‌పై, దశాబ్దాల కలైన వరికపూడిశెలకు బడ్జెట్‌లో నిధులు లేవు. పల్నాడు కరువు పథకం పనుల ఊసే ఎత్త లేదు. బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం గురించి ఆలోచించలేదు. గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా వైఎస్ఆర్ పల్నాడు కరువు నివారణ పథకంగా పేరు మార్చిన ప్రభుత్వం నిధుల విడుదలను విస్మరించింది. వరికపూడిశెల ప్రాజెక్టు విషయంలోనూ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా ఉన్నదని ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతుందని రైతులు మండిపడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో హడావుడిగా సీఎం శంకుస్థాపన చేసి నిధులు విడుదల చేయకుండా చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ అనుమతులు రాకుండానే శంకుస్థాపన చేయడం ప్రజలను మోసం చేయడమేనని చెప్పవచ్చు. దాదాపు 21,473 ఎకరాలను సాగు నీరు అందించే తంగెడ, మాచవరం ఎత్తిపోతల పథకాలు సర్వే దశలో ఉన్నా బడ్జెట్‌లో నిధుల కేటాయింపును విస్మరించింది. ఇప్పట్లో ఈ పథకాల పనులు పట్టాలెక్కే పరిస్థితులు కానరావడంలేదు. జిల్లాలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రకటించిన వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణాన్ని కూడా ప్రభుత్వం విస్మరించిందన్న విమర్శలున్నాయి. రూ.1200 వ్యయం అవుతుందని అంచనా వేసి, 611 గ్రామాలకు నీరు అందించే ఈ బృహత్తర పథకం నిర్మాణంపై ప్రభుత్వం శీతకన్ను వేసింది. నిధులు లేకపోవడంతో రెండేళ్లుగా ఈ పథకం పను లు ప్రారంభం కాలేదు. ఈ బడ్జెట్‌లోనూ నిధులను విస్మరించడంతో ఈ పనులు ఇప్పట్లో ప్రారంభమయ్యే పరిస్థితులు లేవని చెప్పవచ్చు. తాగు, సాగునీటి అవసరాల కోసం సాగర్ కుడికాల్వ పరిధిలోని బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపునకు నిధుల విడుదల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తుందన్న విమర్శలున్నాయి. బుగ్గవాగు సామర్థ్యం పెంచితే గురజాల, మాచర్ల నియోజకవర్గాల ప్రజలకు వేసవిలో తాగునీటి కష్టాలు తప్పే అవకాశం ఉన్నా ప్రభుత్వంలో చలనంలేదు. జల్‌జీవన్ మిషన్, వాటర్ గ్రిడ్ పథకాలు బుగ్గవాగు సామర్థ్యం పెంపుపై అధారపడి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై జిల్లావాసులు తీవ్ర అసం తృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన సాగు, తాగునీటి పథకాలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవ డిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. .



ఎత్తిపోతల

ఓదారుస్తూ.. భరోసా

నిజం గెలవాలి యాత్రలో భువనేశ్వరి



వట్టిచెరుకూరు : అనంతవరప్పాడు ఎస్సీ కాలనీలో కోటేశ్వరరావు భార్యకు చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

- బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థిక సాయం
- టీడీపీ, జనసేన శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని ఘనస్వాగతం

వట్టిచెరుకూరు, నరసరావుపేట రూరల్, రొంపిచర్ల, యడ్లపాడు, ఫిబ్రవరి 7: ఓదారుస్తూ.. పరామర్శిస్తూ.. యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ.. ధైర్యంగా ఉండాలి.. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇస్తూ.. టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర చేపట్టారు. బుధవారం పల్నాడు, గుంటూరు జిల్లాలో ఆమె పర్యటించారు. చంద్రబాబు అరెస్టుతో కలత చెంది గతంలో మృతి చెందిన కుటుంబాలను ఈ పర్యటనలో భువనేశ్వరి ప్రత్యేకంగా పరామర్శించారు. ఆయా కుటుంబాల వారికి ధైర్యం చెప్పి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులో నార్నె విజయలక్ష్మి, అనంతవరప్పాడు ఎస్సీకాలనీలో కోటేశ్వరరావు, యడ్లపాడు ఎస్టీకాలనీలో మరణించిన మొగిలి సత్యనారాయణ కుటుంబాల్ని పరామర్శించారు. అనంతరం నరసరావుపేట మండలం ములకలూరులోని షేక్ సైదా, పాలపాడులోని కొలికొండ అంజనేయులు, రొంపిచర్ల మండలం అన్నవరంలో ఉదయ్‌శేఖర్, చిన్న బిక్షాలు కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చెక్కులు అందజేశారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను ఓదార్చారు.

పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వాగతం

భువనేశ్వరి పర్యటనలో టీడీపీ, జనసేన శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు హారతు లు పట్టి ఆమెకు స్వాగతం పలికారు. యడ్లపాడు,



ములకలూరులో చెక్కును అందజేసి కుటుంబ సభ్యులతో భువనేశ్వరి

చిలకలూరిపేట, కావూరు, అవిశాయపాలెం, ములకలూరు, నరసరావుపేటలోని పల్నాడు రోడ్డు, కాకతీయనగర్, రావిపాడు, పాలపాడులలో మహిళలు, టీడీపీ శ్రేణులు భువనేశ్వరికి స్వాగతం పలికారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి ప్రత్తి పాటి పుల్లారావు, ప్రత్తిపాటి వెంకటకుమారి, నరసరావుపేటలో నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, టీడీపీ కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ నేతృత్వంలో భువనేశ్వరికి స్వాగతం పలికారు. కార్యక్ర మంలో ఎమ్మెల్సీ అనురాధ, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు, వింజనంపాడు గ్రామాల్లో భువనేశ్వరికి అడుగడుగున మహిళలు టీడీపీ, జనసేన శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్ర హాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ప్రత్తిపాడు సమన్వ యకర్త రామాంజనేయులు, మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్య, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, మాజీ జడ్పీటీసీ అన్నాబత్తుని జయలక్ష్మి, ఉగ్గిరాల సీతారామయ్య, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, అనంతవరప్పాడు గ్రామ అధ్య క్షుడు మోపర్తి శంకర్, సర్పంచ్ దారా వెంకట్రావు, జనసేన మండల అధ్యక్షులు పత్తి భావన్నారాయణ, కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు నాగిశెట్టి నాగరాజు, జనసేన సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, ప్రవీణ్, మాజీ సర్పంచ్ ముప్పా మురళీకృష్ణ, మాజీ అధ్యక్షుడు యర్రగుంట్ల నరేంద్రబాబు, వింజనంపాడు సర్పంచ్ నార్నె రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ ఉప్పటూరి సుజాత, మాజీ సర్పంచ్ చింపిరయ్య, మాజీ ఎంపీటీసీ నార్నె సాంబశివరావు, పరిటాల హరిబాబు పాల్గొన్నారు.



నరసరావుపేట: పాలపాడులో చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి

నేతలకు ఇసుకపైనే ప్రేమ

- కట్టలను కూల్చేసి అక్రమార్జన
- వైఎస్ చేసిన అభివృద్ధి తప్ప ఇంకేమీ లేదు
- రాజశేఖరరెడ్డి విగ్రహం పెట్టడాన్ని అడ్డుకున్న నేత
- బాపట్ల బహిరంగ సభలో పీసీసీ సారథి షర్మిల

బాపట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 'నేను దారిలో వస్తుండగా ఓ అన్నను బాపట్ల ఎలా ఉందని అడిగా.. మీ నాన్న ఉన్నప్పుడు 1400 కోట్లతో చేసిన పనులు తప్ప మరేమీ లేదన్నారు. కనీసం రోడ్లు కూడా వేయలేదన్నాడు. ఇక్కడున్న ఎమ్మెల్యే, ఎంపీలకు ఇసుక మాఫియా మీద ప్రేమ తప్ప మరేం లేదు. కట్టలు కట్టడం కాదు కదా వాటిని కూడా కూల్చేసి ఆ ఇసుకను కూడా అక్రమార్జనకు వాడుకుంటున్నారు. రాజశేఖరరెడ్డి విగ్రహం కూడా పెట్టకుండా ఇక్కడున్న వైసీపీ నాయకులు అడ్డుకుంటున్నారు. వీళ్లా ఆయన ఆశయాలను నెరవేర్చేది..' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి అన్నారు. బుధవారం బాపట్లలోని అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తయితే రెండు పంటలకు నీళ్లు అందుతాయని తెలిసీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాజశేఖరరెడ్డి వ్యవసాయాన్ని పండగ చేస్తే పంట నష్ట పరిహారం కూడా ఇవ్వని ప్రభుత్వం జగన్‌దని షర్మిల అన్నారు. ఈ ఐదేళ్లలో ఒక్క రోడ్డు కూడా వేయలేదని, కనీసం బాపట్ల తాగునీటి సమస్యను కూడా పట్టించుకో లేదన్నారు. ఒక్క సీటు కూడా గెలవని బీజేపీకి రాష్ట్రంలోని రెండు పార్టీలు గులాంగిరి చేస్తున్నాయన్నారు. దళిత క్రైస్తవులకు దళితుల హోదా దక్కాలంటే పీసీసీ సారథి షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. గతంలో రామానాయుడు మీద పోటీ చేసి కొద్ది తేడాతో ఓడిపోయానని కాంగ్రెస్ మళ్లీ ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. రాజశేఖరరెడ్డి దిష్టిబొమ్మలు తగలబెట్టిన వ్యక్తిని వైసీపీలోకి తీసుకుని పదవులు కట్టబెట్టారని స్థానిక ఎమ్మెల్యేని ఉద్దేశించి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు తెలిపారు.



మాట్లాడుతున్న షర్మిల

రోడ్ షో విజయవంతం..

బాపట్ల చీలురోడ్డు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు జరిగిన షర్మిల రోడ్‌షోలో కాంగ్రెస్ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నాయి. రోడ్డు పొడ వునా ఉన్న జనానికి అభివాదం చేస్తూ షర్మిల ముందుకు కదిలారు. బహి రంగ సభ అనంతరం ఆమె రాత్రి బస కోసం బాపట్ల ఇంజనీరింగ్ కళాశా లకు వెళ్లారు. బుధవారం రాత్రికి అక్కడే బస చేయనున్న ఆమె గురువారం తెనాలి మండలంలో జరిగే రచ్చబండ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో నేతలు కెవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి, కనుమూరి బాపిరాజు, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు



సభకు హాజరైన కార్యకర్తలు, ప్రజలు

జై శ్రీరామ్

- గుంటూరు నుంచి అయోధ్యకు రైలు ప్రారంభం

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని భవ్యమైన రామ మందిరం- దివ్యమైన బాలరాముని దర్శనార్థం రామ భక్తులతో కూడిన అయోధ్య ప్రత్యేక రైలు గుంటూరు నుంచి బయలుదేరింది. ఈ సందర్భంగా గుంటూరు రైల్వేస్టేషన్ ప్రాంగణం జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగింది. రామ భక్తులతో స్టేషన్ కిక్కిరిపోసింది. శ్రీరామభక్తులకు నుదుటిన తిలకం అద్ది బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జాతీయ కార్యదర్శి వై సత్యకుమార్ పలు బోగీలలోకి వెళ్లి ప్రయాణికులతో మాట్లాడారు. క్షేమంగా అయోధ్యదాం పర్యటన ముగించుకుని రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ప్రత్యేక రైలు లోకోకి పూజలు చేసి వారు పోశారు. ఆ తర్వాత పురందేశ్వరి పచ్చ జెండా ఊపి రైలుకు సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ ఏపీ నుంచి అయోధ్యకు వెళుతున్న మొదటి రైలన్నారు. భక్తులు తండోపతండాలుగా బాలరాముని దర్శనం కోసం వెళుతుంటే చూడాలని మాత్రమే తాను వచ్చానన్నారు. కార్యక్రమంలో తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు సాంబశివరావు పాల్గొన్నారు.



రైలుకి జెండా ఊపి ప్రారంభిస్తున్న పురంధేశ్వరి

గురజాలలో సర్వేలన్నీ టీడీపీ వైపే
● యరపతినేనితో చెప్పిన చంద్రబాబు
7లో..

దిక్సూచి DIKSUCHI

నల్సార్‌లో మేనేజ్‌మెంట్ కోర్సులు



హైదరాబాద్‌లోని 'నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా'కి చెందిన మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం- ఇంటిగ్రేటెడ్ బీబీఏ-ఎంబీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్లు విడుదల చేసింది.

● వెబ్‌సైట్: doms.nalsar.ac.in

బీబీఏ-ఎంబీఏ ప్రోగ్రామ్(ఐపీఎం)

ఇది ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. యూజీసీ నిబంధనల మేరకు చాయిస్ బేస్డ్ క్రెడిట్ పాలసీతో ప్రోగ్రామ్‌ను రూపొందించారు. ఇందులో మొత్తం 15 టర్మ్‌లు ఉంటాయి. రెండో ఏడాది తరవాత అభ్యర్థులు స్టార్టప్ కంపెనీల్లో ఆరు నుంచి ఎనిమిది వారాలు ఇంటర్న్‌షిప్; మూడు, నాలుగు సంవత్సరాల కోర్సు పూర్తయ్యాక స్పెషలైజేషన్‌కు సంబంధించిన ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది.

ఎంబీఏ లెవెల్ స్పెషలైజేషన్లు: బిజినెస్ రెగ్యులేషన్స్, కార్పొరేట్ గవర్నెన్స్, కోర్టు మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఇన్నోవేషన్ అండ్ సస్టెయినబిలిటీ, మార్కెటింగ్, ఆపరేషన్స్ అండ్ సిస్టమ్స్.

సీట్లు: మొత్తం 66 సీట్లున్నాయి.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. ఇంటర్ స్థాయి చివరి సంవత్సర పరీక్షలు రాస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్‌మెట్(యూజీ)/ఇండోర్ ఐఐఎం నిర్వహించే ఐపీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 31

ఎంబీఏ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

స్పెషలైజేషన్లు: కార్పొరేట్ గవర్నెన్స్, ఇన్నోవేషన్ అండ్ సస్టయినబిలిటీ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్, ఆపరేషన్స్ అండ్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, బిజినెస్ రెగ్యులేషన్స్, కోర్ట్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్. **సీట్లు:** మొత్తం 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. నల్సార్ మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎన్‌మెట్ పీజీ)2024/క్యాట్ 2023 అర్హత పొంది ఉండాలి. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 18

ఎఫ్ఆర్ఐలో ఎమ్మెస్సీ

డెహ్రాడూన్‌లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్ఆర్ఐ)- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఫారెస్ట్రీ, ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, సెల్యూలోజ్ అండ్ పేపర్ టెక్నాలజీ స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్ రిమోట్ ప్రొక్టోర్డ్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

అడ్మిషన్ టెస్ట్ వివరాలు: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. బేసిక్ సైన్సెస్, సోషల్ సైన్సెస్, అర్థమెటిక్ అండ్ క్వాంటిటేటివ్ ఎబిలిటీస్, కంప్యూటేషనల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ టేబుల్స్, గ్రాఫ్స్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, కాంప్రహెన్షన్, ఒకాబులరీ, గ్రామర్, ఇడియమ్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు వంతు మార్కు కోత విధిస్తారు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 15 శాతం మార్కులు రావాలి.



ముఖ్య సమాచారం

- ★ డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45శాతంచాలు.
- ★ **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- ★ **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 8
- ★ **ఆన్‌లైన్ రిమోట్ ప్రొక్టోర్డ్ అడ్మిషన్ టెస్ట్ తేదీ:** మే 19
- ★ **చిరునామా:** రిజిస్ట్రార్, ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్ఆర్ఐ), ఐపీఈ కౌలాగర్ రోడ్, డెహ్రాడూన్-248195
- ★ **వెబ్‌సైట్:** www.fridu.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Fe0ahm9లో చదవండి.

నాగార్జున వర్సిటీలో డ్యూయెల్ డిగ్రీ

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ)- బీటెక్+ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ సెల్ఫ్ సపోర్ట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిని డా.వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో నిర్వహిస్తున్నారు. మొత్తం 510 సీట్లు ఉన్నాయి. ఏఎన్‌యూ నిర్వహించే ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఎన్‌యూఈఈటీ) 2024 ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. నాలుగేళ్ల కోర్సు పూర్తిచేసిన తరవాత బీటెక్ డిగ్రీతో ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది.

విభాగాలు-సీట్లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 120, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 120, మెకానికల్ ఇంజనీరింగ్ 30, సివిల్ ఇంజనీరింగ్ 30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 30, డేటా సైన్స్ 60, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ 60, సైబర్ సెక్యూరిటీ 60 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 10
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 1 నుంచి
- **ఏఎన్‌యూఈఈటీ 2024 తేదీ:** ఏప్రిల్ 7
- **ఫలితాలు విడుదల:** ఏప్రిల్ 10
- **వెబ్‌సైట్:** www.anucet.in

విధ్వంసాల జాతర



రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. కావ్యాథాపర్, అనుపమా పరమేశ్వరన్ కథానాయికలు. ఈనెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ ఆద్యంతం రవితేజ్ యాక్షన్ హంగామా కనిపించింది. సరికొత్త మేకోవర్‌లో ఆయన కనిపించారు. 'వచ్చాడంటే మోతరా, విధ్వంసాల జాతర' అంటూ ఆయన పలికిన డైలాగ్‌లు మాస్ ప్రేక్షకులను ఉర్రూతలూగించేలా ఉన్నాయి. ఈ చిత్రంలో నవదీప్, అవసరాల శ్రీనివాస్, మధుబాల, అజయ్‌ఘోష్, శ్రీనివాస్‌రెడ్డి కీలకపాత్రలు పోషించారు. సంగీతం: డేవ్ జాంద్

మానవత్వాన్ని పంచే మొయినుద్దీన్ భాయ్



'మతాన్ని నమ్మితే మనసులో ఉంచుకో...మానవత్వాన్ని అందరితో పంచుకో' అంటున్నారు రజనీకాంత్. 'లాల్ సలామ్' చిత్రంలో మొయినుద్దీన్ భాయ్ పాత్రలో రజనీకాంత్ పలికిన డైలాగ్ ఇది. ఈ నెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. గ్రామీణ వాతావరణం, రాజకీయాలు, మతవిద్వేషాల నేపథ్యంలో సాగే కథ అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. రజనీకాంత్ చాలా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. ఈ చిత్రానికి ఐశ్వర్య దర్శకత్వం వహించారు. విష్ణు విశాల్, విక్రాంత్, జీవితా రాజశేఖర్, క్రికెటర్ కపిల్ దేవ్ కీలకపాత్రలు పోషించారు. సుభాస్కరన్ నిర్మించారు.

ఫ్యామిలీస్టార్ ప్రేమగీతం



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఫ్యామిలీస్టార్'. ఆయనకు జోడీగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం చిత్రబృందం 'నందనందనా' అంటూ సాగే ప్రేమగీతాన్ని విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ మొదలుపెట్టింది. ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, గోపీ సుందర్ స్వరాలు సమకూర్చారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేయూ మోహనన్. ఎడిటర్: మార్తాండ్ కే వెంకటేశ్

మార్చిలో గామి ఆగమనం



విష్వక్‌సేన్ కథానాయకుడిగా రూపొందుతున్న అడ్వెంచర్ డ్రామా 'గామి'. విద్యాధర్ కాగిత దర్శకత్వంలో కార్తీక్ శబరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. 'గామి' చిత్రాన్ని మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విష్వక్‌సేన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విద్యాధర్ 'గామి' సినిమా కోసం చాలా పరిశోధన చేశాడు. సినిమా పూర్తి చేయడానికి దాదాపు నాలుగున్నరేళ్లు పట్టింది. వారాణసిలో షూటింగ్ చేస్తున్నప్పుడు చాలామంది నన్ను చూసి నిజమైన అఘోరా అనుకున్నారు. నాకు ధర్మం చేశారు. ఓ ముసలామె ఆప్యాయంగా భోజనం పెట్టారు. ఈ సినిమా కోసం చాలా కష్టాలు పడ్డాం. ట్రైలర్ మైండ్‌బ్లోయింగ్‌గా ఉంది. సినిమా అందరినీ అలరిస్తుంది' అన్నారు. విద్యాధర్ మాట్లాడుతూ 'అఘోర శంకర్ హిమాలయాల్లో చేసే సాహసోపేత ప్రయాణమే 'గామి' కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నించాం. విష్వక్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఏదడిగితే అది చేశారు. గడ్డకట్టించే చలిలో సైతం నటించాడు. ఈ సినిమా కోసం కుంభమేళాని చిత్రీకరించాం' అని చెప్పారు. కార్తీక్ శబరీష్ మాట్లాడుతూ '2018లో ఈ సినిమాను మొదలుపెట్టాం. చాలా ఎగ్జయిటింగ్ కంటెంట్ ఉన్న సినిమా ఇదని తెలిపారు. ఈ చిత్రంలో చాందిని చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఎంజి అభినయ, హారిక, మహ్మద్ సమద్ ముఖ్య తారాగణం. సంగీతం: నరేశ్ కుమారన్.

రెండింతల వినోదం



సిద్దు జొన్నలగడ్డకు స్టార్ స్టేటస్‌ను తెచ్చిన చిత్రం 'డీజే టిల్లు'. 'అట్లుంటది మనతోని' అంటూ ఆ సినిమాలో ఆయన పంచిన వినోదం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు మరోసారి టిల్లూ బాయ్ ప్రేక్షకులను ఎంటర్టైన్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'డీజే టిల్లు'కు సీక్వెల్‌గా 'టిల్లూ స్క్వేర్' రూపొందుతోంది. మల్లిక్‌రామ్ దర్శకత్వంలో సితార ఎంటర్టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. మార్చి 29న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం సిద్దు పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం బర్త్‌డే గ్లింప్స్‌ను విడుదల చేసింది. కారులో హీరో హీరోయిన్ల రొమాన్స్, రాధికతో ప్రణయం గురించి టిల్లూ గుర్తు చేసుకొనే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. సిద్ధు తనదైన స్టైల్లో మరోసారి డైలాగ్‌లతో మ్యాజిక్ చేశాడు. ఈ సినిమా ట్రైలర్‌ను ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. రామ్ మిరియాల, అచ్చు రాజమణి సంగీతం అందిస్తున్నారు. ఎస్ఎస్ థమన్ నేపథ్య సంగీతం సమకూరుస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సాయిప్రకాశ్ ఉమ్మడి సింగు. ఎడిటర్: నవీన్ నూలి

ఆర్ఆర్ఆర్ ఓ అద్భుతం

రాజమౌళిపై కామెరూన్ ప్రశంసలు



హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ మరోమారు రాజమౌళిని అభినందనలతో ముంచెత్తారు. 'ఆర్ఆర్ఆర్ సినిమా ఓ అద్భుతం అని ప్రశంసించారు. సాటర్న్ అవార్డ్స్ కార్యక్రమం ఇందుకు వేదికైంది. ఓ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు కామెరూన్ బదులిస్తూ "ఆర్ఆర్ఆర్ చాలా అద్భుతమైన సినిమా అనిపించింది. ఆ అనుభూతినే రాజమౌళితో పంచుకున్నాను. ప్రపంచం మొత్తం ఆ సినిమాను ఇష్టపడింది. భారతీయ సినిమా ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటడం మంచి పరిణామమని' పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై స్పందించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రబృందం కామెరూన్‌కు ధన్యవాదాలు తెలిపింది. గతేడాది జరిగిన క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల కార్యక్రమంలో రాజమౌళి, కామెరూన్ కలిశారు. ఆ సందర్భంలో కామెరూన్ 'ఆర్ఆర్ఆర్' అద్భుతంగా ఉందని కొనియాడారు. ప్రస్తుతం మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి ఓ చిత్రం రూపొందిస్తున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/YowEbvo లో చదవండి.

నన్నే హీరోయిన్‌గా అనుకున్నారు



సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మ జంటగా నటించిన ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరుపేరు భైరవకోన'. వీఐ ఆనంద్ దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించారు. ఈ నెల 16న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా వర్ష బొల్లమ్మ మీడియాతో మాట్లాడారు.

● ఈ కథ రాసుకున్నప్పుడే నన్ను హీరోయిన్‌గా అనుకున్నానని ఆనంద్ చెప్పారు. స్టోరీ చాలా కొత్తగా, అద్భుతంగా అనిపించింది. 'అసలు ఇలాంటి కథను ఎలా ఊహించగలిగారో' అనిపించింది. ఇలాంటి పాత్ర గతంలో ఎప్పుడూ చేయలేదు. అందుకే నిర్ణయం తీసుకోవడానికి కొంత సమయం అడిగాను. ఆనంద్ పాత్ర గురించి వివరంగా చెప్పాక నేను చేయగలననే నమ్మకం ఏర్పడింది.

● పూర్తిస్థాయి వినోదం పంచే చిత్రమిది. ప్రేక్షకులకు మంచి సందేశం, ఉత్కంఠభరితమైన ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. అద్భుతం అనిపించే అతీంద్రియ శక్తుల నేపథ్యం ఉంటుంది. సినిమా నిర్మాణం విషయంలో మేకర్స్ ఎక్కడా రాజీపడలేదు.

● 'స్వాతిముత్యం, మిడిల్ క్లాస్ మెలోడీస్' చిత్రాల్లో పక్కింటి అమ్మాయి తరహా పాత్రలో కనిపించాను. ఈ చిత్రంలో వాటికి భిన్నంగా 'భూమి' అనే గిరిజన యువతి పాత్రలో కనిపిస్తాను. ఊళ్లో తనొక్కతే చదువుకున్న అమ్మాయి. అందంగా, అమాయకంగా కనిపిస్తుంది. కానీ చాలా బలమైన పాత్ర. యాక్షన్ సీన్లు కూడా ఉన్నాయి.

ఏం జరిగింది?



విజయ్ శంకర్, సావిత్రి కృష్ణ జంటగా నటిస్తున్న చిత్రం 'అంతే.. అలా జరిగిపోయింది'. శ్రీరామ్ అమృతపురి దర్శకత్వంలో కంచర్ల సత్యనారాయణరెడ్డి, సముద్రాల మహేశ్‌గౌడ్ నిర్మించారు. బుధవారం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నిర్మాత ప్రసన్నకుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. యువతను ఆకట్టుకునే కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం, ఆద్యంతం ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తుందని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి జయసూర్య బొప్పెం సంగీతాన్ని అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: మురళీమోహన్.

నిండు ప్రాణం.. సమాధి

పైపు లీకులు మరమ్మతులో అపశ్రుతి ● విధులు నిర్వర్తిస్తూ మునిసిపల్ కార్మికుడు మృతి ● తెనాలిలో విషాదం



ఎక్సకవేటర్‌తో వెంకటేశ్వర్లుపై పడిన భారీ మట్టిని తొలగిస్తున్న అధికారులు, మట్టిలో కూరుకుపోయిన వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు (ఫైల్ ఫొటో)

తెనాలి రూరల్, ఫిబ్రవరి 7: మంచినీటి పైపులైను మరమ్మత్తుకు తీసిన గుంత ఓ నిండుప్రాణాన్ని బలిగొంది. వివరాల్లోకి వెళితే.. తెనాలి పట్టణంలోని మునిసిపాలిటీ పరిధిలో బుధవారం మంచినీటి పైపులైను లీకుల మరమ్మత్తులు చేపట్టారు. ఐతానగర్ రజక చెరువురోడ్డులో ప్రధాన రహదారి వెంట జేసీబీ సహాయంతో దాదాపుగా 5 అడుగు గుంత తవ్వగా పైపులైన్ లీకు అవుతూ కనిపించింది. మునిసిపల్ టెంపరరీ పారిశుధ్య కార్మికుడైన ఇమల్ల వెంకటేశ్వర్లు(50) గుంతలో దిగి పైపు చుట్టూ ఉన్న మట్టిని తీసేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇదే క్రమంలో జేసీబీతో తవ్వి గుంత అంచున వేసిన మట్టి ముద్ద జారి పనిచేస్తున్న వెంకటేశ్వర్లుపై పడింది. ఆ మట్టిలో పూర్తిగా కూరుకుపోయిన వెంకటేశ్వర్లు బయటకు వచ్చే అవకాశం లేకపోయింది. తోటి కార్మికులు మట్టి తొలగించి కాపాడే ప్రయత్నం చేయగా.. మట్టి ముద్దగా ఉండటంతో దానిని తీయడం కష్టమైంది. దాదాపుగా 20 నిముషాలు పైనే సమయం పట్టేసరికి వెంకటేశ్వర్లు గుంతలోనే ప్రాణాలు విడిచాడు. 108 సిబ్బంది ఘటనా స్థలానికి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడు చుండూరు మండలం చినపరిమి గ్రామవాసి. అతడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. విషయం తెలుసుకున్న భార్య మరియమ్మ, కుమారులు మధుబాబు, సుద్దబాబు, ఇతర కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని విగతజీవుడిగా ఉన్న వెంకటేశ్వర్లును చూసి గుండెలు పగిలేలా రోదించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్న ఇతర సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మృతుని కుటుంబసభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంచినీటి పైపులైన్లు మరమ్మత్తులు చేసే క్రమంలో మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు దగ్గరుండి పనులు పర్యవేక్షించాల్సి ఉంది. వారెవరూ లేకుండా పనులు పురమాయించి అక్కడి నుంచి వెళ్లిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనులు జరిగే సమయంలో ఇంజనీరింగ్ సిబ్బంది అక్కడే ఉన్నారని ఇది అనుకోకుండా జరిగిన ఘటన మాత్రమేనని కమిషనర్ శేషన్న చెప్పారు.

టిప్పర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి

వినుకొండటౌన్, ఫిబ్రవరి 7: ద్విచక్రవాహనాన్ని ప్రమాదవశాత్తు టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పిట్టంబండ గ్రామసమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉమ్మడివరం గ్రామ ఎస్సీ కాలనీ చెందిన పిడతల చంద్రశేఖర్ (18) వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తల్లి పున్నమ్మతో కలిసి వినుకొండ వద్ద ఓ శుభకార్యానికి హాజరైన అనంతరం మసీదుమాన్యంలోని తన సోదరి ఇంటి వద్దకు వెళ్లారు. అనంతరం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా పిట్టంబండ సమీపంలో వెనుకగా వస్తున్న కంకరు టిప్పర్ తగలడంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న పున్నమ్మతో పాటు చంద్రశేఖర్ కిందపడ్డారు. చంద్రశేఖర్‌కు టిప్పర్ టైరు తగలడంతో తీవ్రగాయాలు కాగా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుమందు తాగి విద్యార్థి మృతి

వినుకొండటౌన్, ఫిబ్రవరి 7: పురుగుమందు తాగి విద్యార్థి మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శావల్యాపురం మండలం పిచికలపాలెం గ్రామానికి చెందిన అమృతపూడి నాగరాజు వినుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎంఎల్‌టీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 5వ తేదీన నాగరాజు గడ్డి మందు తాగాడు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



రంగు పడింది..

సత్తెనపల్లి, ఫిబ్రవరి 7: సత్తెనపల్లి పట్టణంలోని ఏరియా వైద్యశాలకు అధికార పార్టీ రంగులు వేయటం చర్చనీయాంశంగా ఉంది. 2018లో స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు హయాంలో ఈ భవనాన్ని నిర్మించారు. దానిపై అదనపు భవన నిర్మాణ పనులు కూడా 90శాతం పూర్తయ్యాయి. ఇప్పుడు భవనానికి రంగులు వేసి ఉండటం చూసి వైద్యశాలకు వచ్చిన రోగులతో పాటు పట్టణ ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

డయేరియా.. ఒకరి మృతి?

- గుంటూరులో తాగునీరు కలుషితం
- పైపులైన్లకు మరమ్మతులు.. తాగునీరు సరఫరా
- వాంతులు, విరేచనాలతో జీజీహెచ్‌కి చేరిన బాధితులు
- ప్రైవేటు, స్థానిక వైద్యుల వద్ద కూడా పలువురి చికిత్సలు

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 7: గుంటూరులో కలుషితమైన తాగునీటికి ఒకరు బలయ్యారు. వాంతులు, విరేచనాలతో పలువురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పైపులైన్ల లీకులతో మురుగునీరు కలిసి గతంలో నగరంలో తాగునీరు కలుషితమైంది. అప్పట్లో ఆ నీటి కారణంగా పలువురు మృతి చెందగా పెద్దసంఖ్యలో ఆస్పత్రులు పాలైన విషయం తెలిసిందే. ఇదే రీతిలో బీఆర్ స్టేడియం నుంచి సంగడిగుంట ప్రాంతంలోని తిరుమలాచారి కాలనీలోకి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమైంది. ఇటీవల బీఆర్ స్టేడియం బయట పైపులైన్లకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల నుంచి ఆ ప్రాంతం వారికి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమైంది. దీంతో సూర్యదేవర ఎస్టేట్ సమీపంలోని తిరుమలాచారి కాలనీకి చెందిన కొర్రపాటి ఓబులు, ఆయన భార్య జయమ్మ, కొడుకు కుమార్, అల్లుడు కృష్ణలు వాంతులు, విరేచనాలతో అవస్వస్థతకు గురై గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో రెండు రోజులుగా చికిత్స పొందుతున్నారు. బుధవారం రాత్రి కొర్రపాటి ఓబులు(50) మృతి చెందాడు. అల్లుడు కృష్ణని మెరుగైన వైద్యం కోసం కాకానిరోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పొన్నూరు రోడ్డులోని అహ్మద్‌నగర్‌కు చెందిన జీవా అనే మరో వ్యక్తి వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తిరుమలాచారి కాలనీకి చెందిన మరో పది కుటుంబాల వారు బుధవారం రాత్రి వాంతులు, విరేచనాలకు గురై స్థానికంగా ఉన్న వైద్యుల వద్ద చికిత్స పొందుతున్నారు.



ఓబులు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నసీర్

మున్సిపల్ ఇంజనీర్ల నిర్లక్ష్యం వల్లే..

బీఆర్ స్టేడియంలో పని చేస్తున్న మున్సిపల్ ఇంజనీర్ల నిర్లక్ష్యం వల్లే తిరుమలాచారి కాలనీ, అహ్మద్‌నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీరు కలుషితమై డయేరియా తరహాలో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి నసీర్ అహ్మద్ తెలిపారు. ఇప్పటికే ఒకరు మృతి చెందారని, కలుషిత నీరు సరఫరా వల్లే ఈ సంఘటన జరిగిందన్నారు. బుధవారం రాత్రి బాధిత కుటుంబాలను పరామర్శించిన ఆయన వారికి కావాల్సిన వైద్య సదుపాయాలను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందించాలన్నారు.

కన్నతల్లే కడతేర్చింది..

● యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ

గుంటూరు, ఫిబ్రవరి 7: స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీకలవాగు కట్టమీద మంగళవారం రాత్రి దారుణ హత్యకు గురైన షేక్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, సీఐ నరేష్, వెనుక నిందితులు

మహబూబ్ సుభాని హత్య కేసులో మిస్టరీ వీడింది. తొలుత ఈ హత్య ఆటోడ్రైవర్ షేక్ చిన బాజీ చేసినట్లు భావించారు. అయితే పోలీసుల విచారణలో ఈ హత్యలో చినబాజీతో పాటు హతుడి తల్లి జరీనాబేగం హస్తం కూడా ఉన్నట్లు తేలింది. దీంతో గంటల వ్యవధిలోనే ఇరువురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. బుధవారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, సీఐ డి.నరేష్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

పీకలవాగుకట్ట ప్రాంతానికి చెందిన జరీనాబేగం కుమారుడు సుభాని ఆటో మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా జరీనాబేగం ఆటోడ్రైవర్ చినబాజీతో సహజీవనం సాగిస్తోంది. అయితే ఇది సుభానీకి ఇష్టం లేదు. అంతేగాక తాను సంపాదించిన సొమ్మును తల్లి బాజీకి పెడుతుందని బావించి తరచూ బాజీతో గొడవ పడుతుండేవాడు. అయితే తమ సంబంధానికి కొడుకు అడ్డుగా ఉన్నాడని భావించిన తల్లి జరీనాబేగం తన ప్రియుడితో కలసి కన్న కుమారుడి హత్యకు పథకం రూపొందించింది. ముగ్గురూ కలసి మద్యం సేవిస్తుండగా వారి మధ్య గొడవ జరిగింది. దీంతో తల్లి, ప్రియుడు కలసి రోకలిబండతో సుభానీని కొట్టి చంపారు. ఇరువురు నిందితులను అరెస్ట్ చేసిన నగరంపాలెం సీఐ నరేష్, సిబ్బందిని వెస్ట్ డీఎస్పీ అభినందించారు.



ఆనందబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేరిన వైసీపీ కార్యకర్తలు

వైసీపీకి ఓటేసి కష్టాలపాలయ్యాం..

● ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరిన చినపరిమి కార్యకర్తలు

చుండూరు, ఫిబ్రవరి 7: పొరపడ్డాం.. అసమర్థుడికి ఓటు వేసి కష్టాలు తెచ్చుకున్నాం.. ఇక నుంచి మీ వెంటే మా పయనం అంటూ చినపరిమి దళితవాడకు చెందిన వైసీపీ కార్యకర్తలు, నాయకులు బుధవారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గుంటూరులోని ఆనందబాబు క్యాంపు కార్యాలయంలో చినపరిమికి చెందిన 20 కుటుంబాలు ఆనందబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ కల్లబొల్లి వాగ్దానాలు చేసి ఆశలు రేపి గెలిచిన జగన్ చివరికి ప్రజలను రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచాడన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి రాష్ట్రాన్ని ఈ సైకో పాలన గురించి విముక్తి కలిగించడానికి ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని తెలిపారు. ఈ సందర్భంగా చినపరిమి గ్రామంలో గత ప్రభుత్వంలో రూ.5 కోట్లతో జరిగిన అభివృద్ధి పనుల గురించి గ్రామస్తులు ఆనందబాబుకు గుర్తు చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొక్కిలిగడ్డ చిరంజీవి, రేవంత్, కళ్యాణ్, చొప్పర ఇజ్రాయిల్, జాన్ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట, ఫిబ్రవరి 7: నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవ రాయలు బుధవారం ఢిల్లీలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును కలిశారు. టీడీపీలో తన చేరికపై చంద్రబాబుతో లావు చర్చించినట్లు తెలిసింది. 11వ తేదీ తర్వాత పార్టీలో చేరే అంశంపై చంద్రబాబుతో చర్చించగా ఇందుకు ఆయన అంగీకరించారని చెబుతున్నారు. ఇప్పటికే నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా శ్రీకృష్ణదేవారాయలు పేరును టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ఇరువురు మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. మొత్తం మీద చంద్రబాబుతో భేటీతో లావు టీడీపీలో చేరికకు ముహూర్తం ఖరారైనట్లు తెలిసింది. వారంలోగా లావు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. లావు బాటలోనే మాజీ ఎమ్మెల్యే మక్కెనవైసీపీని వీడారు. జంగా వైసీపీకి రాజీనామా చేసే అంశం నేడు పిడుగురాళ్లలో ఆయన నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేంలో తేలనుంది. ఇటీవల లావు వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

యువకుడి హత్య కేసులో వీడని మిస్టరీ

● పోలీసులపై పరస్పర ఆరోపణలు

బాపట్ల, ఫిబ్రవరి 7: బాపట్లలో కలకలం రేపిన యువకుడి హత్య కేసులో మిస్టరీ వీడలేదు. హత్యకు గల కారణాలు పోలీసులకు అంతుబట్టలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా మద్యం, గంజాయి మత్తులో సినీఫక్కీలో జరిగిన ఈ ఘటన బాపట్ల పరిసర ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారింది. మంగళవారం చీలురోడ్డుసెంటర్‌లో షేక్ యాసిన్ అనేయువకుడిపై కొంతమంది యువకులు దాడిచేసినట్లు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోనూ అనే యువకుడు మరికొంతమందితో కలిసి వచ్చి తనను మీ అంతా చూస్తామని బెదిరించి దాడిచేశాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించకపోవటంతో యువకుడి హత్యకు దారితీసిందని మృతుడి కుటుంబసభ్యులతోపాటు బాధిత కుటుంబాలవారు ఆరోపిస్తున్నారు. యాసిన్ ఫిర్యాదు చేసిన తర్వాత పోలీసులు సోనూ స్నేహితుడు రాహుల్ బంధువులకు ఫోన్ చేసి ఇలాంటి బెదిరింపులకు పాల్పడితే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో రెచ్చిపోయిన సోనూ, రాహుల్‌లు తమ స్నేహితులతో కలిసి యాసిన్‌కు ఫోన్ చేసి మరలా బెదిరించి ఎక్కడ ఉన్నారో కూడా సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే యాసిన్ స్నేహితుడు నిత్యం రద్దీగా ఉండే సూర్యలంకరోడ్డులోని రెస్టారెంట్ వద్ద ఉన్న వారిపై దాడి చేసి గోరంట్ల సుమంత్‌ను హత్య చేసినట్లు తెలుస్తున్నది. ఈ దాడిలో సుమంత్‌తోపాటు, రాహుల్ కూడా తీవ్రంగా గాయపడి చీరాలలో చికిత్స పొంది వెళ్ళిపోయినట్లు తెలిసింది. గతంలో యాసిన్‌కు, సోనూకు మధ్య గొడవలు ఉన్నట్లు సమాచారం. సంచలనం రేపిన ఈ సంఘటనలో పోలీసులు సరిగ్గా స్పందించకపోవటం వల్లే దాడి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సాయంత్రం 7గంటలకు ఫిర్యాదు చేశారు : సీఐ

యాసిన్ అనే యువకుడు తనపై కొంతమంది దాడి చేసి బెదిరించారని సాయంత్రం 7గంటలకు ఫిర్యాదు చేసినట్లు పట్టణ సీఐ యు.శ్రీనివాసులు తెలిపారు. దీనికి కారకులైన వారిని పిలిపించి విచారిస్తామని చెప్పగా యాసిన్‌ను తన యాజమాన్యంకు సమాచారం ఇచ్చి వస్తానని బయటకెళ్ళిన అరగంట తర్వాత హత్య జరిగినట్లు సమాచారం వచ్చిందన్నారు. అక్కడకు వెళ్ళి చూడగా సుమంత్‌ను హత్య చేసినట్లు గుర్తించటంతోపాటు అక్కడ రాహుల్‌కు సంబంధించిన రెండు కార్లు ఉండగా అందులో ఒకటి ధ్వంసం చేసి ఉన్నట్లు గుర్తించామన్నారు. కేసును రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. హత్యకు గురైన గోరంట్ల సుమంత్ భౌతికకాయాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. రూరల్ సీఐ జి.హజరత్‌బాబు ఆధ్వర్యంలో పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనకు కారకులైన వారిలో ఇరువురిని విచారిస్తున్నట్లు సమాచారం.

గురజాలలో సర్వేలన్నీ టీడీపీ వైపే

● యరపతినేనితో చెప్పిన చంద్రబాబు



చంద్రబాబుతో యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 7: గురజాల సీటు ఈసారి తప్పకుండా మంచి మెజారిటీతో గెలుస్తాం.. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలుంటే సరిచూసుకో.. శ్రీనివాస్ అని టీడీపీ అధినేత చంద్రబాబు గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలకు టీడీపీ సమాయత్తమవుతున్న నేపథ్యంలో జిల్లాల వారీగా దాదాపు టిక్కెట్ ఖాయమై పోటీచేసే అభ్యర్థులతో చంద్రబాబు ముఖాముఖిగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. బుధవారం పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతో సమావేశమయ్యారు. దాదాపు 20 నిమిషాలకు పైగా వారిద్దరి మధ్య వివిధ అంశాలపై చర్చ జరిగింది. వివిధ సంస్థలు నిర్వహించిన పలు సర్వేలన్నింటిలోను గురజాలలో టీడీపీ వైపే చూపుతున్నాయని చంద్రబాబు యరపతినేనితో అన్నారు. గురజాలలో సైకిల్ స్పీడ్ పెరిగిందని, రేపటి ఎన్నికల్లో కచ్చితంగా గెలిచే విధంగా అన్ని సర్వేలు సూచిస్తున్నాయి. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలున్నా వాటిని జాగ్రత్తగా చూసుకుంటూ ముందుకెళ్లాలి శ్రీనివాస్.. అంటూ చంద్రబాబు యరపతినేని భుజం తట్టారు. ఉమ్మడి జిల్లా, పల్నాడు జిల్లాలోనూ గురజాలతో పాటు అన్ని నియోజకవర్గాలు కూడా కచ్చితంగా గెలుస్తామని చంద్రబాబు తెలిపారు. గురజాలలో మంచి మెజారిటీతో గెలిచి రావాలని చంద్రబాబు సూచించారు. 1994లో ఎన్‌టీఆర్ మొదటిసారిగా ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వగా అప్పటి నుంచి వరుసగా గురజాల నుంచి పోటీ చేస్తున్నానని, మీరిచ్చిన స్ఫూర్తితోనే గురజాలలో పనిచేస్తున్నానని, ఇప్పుడు కూడా 7వసారి గురజాల నుంచి పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ నాయకుల అక్రమాలకు 8 మంది చిన్నారులు చనిపోయినా, 11 మంది హత్యకు గురైనా ఎక్కడా తొణక్కుండా వారందరికీ నేనున్నాననే ధీమా, నీలో వున్న ధైర్యమే కార్యకర్తలందరూ నీవెంట నడిచేలా చేస్తుందన్నారు. పల్నాడులో ఫ్యాక్షన్‌ను రూపుమాపి అభివృద్ధే ధ్యేయమన్న నీ ఆలోచన గొప్పది.. అదే నీ గెలుపుకు బాట వేస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు.



తుళ్ళూరు శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తం

● 1513వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పెద్దల దోపిడీ ఆగటం లేదని, మూడు ముక్కల ఆటతో రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశారని 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు బుధవారం నాటికి 1513వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాలు వారు మాట్లాడుతూ పరిపాలనకు పనికిరాని వారిని సలహాదారులుగా పెట్టుకొని, నెలకే కొన్ని కోట్ల రూపాయల ప్రజాధనం తగేలేస్తున్నారన్నారు. ప్రజా రాజధాని అమరావతిలో మాత్రం అంగుళం నిర్మాణాన్ని సీఎం జగన్‌రెడ్డి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పాలన అమరావతి నుండే చేస్తున్నారని, అదే అమరావతి మీద విషం చిమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వీర్యం చేయటానికి కుట్రలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును కూడా అమలు చేయకుండా నాన్చుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం.. ఆ ప్రజలనే మూడు ముక్కల ఆటతో వెన్నుపోటు పొడిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానులకు స్వస్తి పలికి, రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినానాదాలు చేశారు. మంద డం, తుళ్లూరు, వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం, వెలగపూడి తదితర రాజధాని గ్రామాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని సన్మానిస్తున్న జయదేవ్, కనకమేడల, రామ్మోహన్‌నాయుడు

అందరివాడు వెంకయ్యనాయుడు

● మాజీ ఉప రాష్ట్రపతిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ ఎంపీలు

గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో సైద్ధాంతిక విభేదాలే తప్ప వ్యక్తిగత విభేదాలుండవని నమ్మే వెంకయ్యనాయుడు అన్ని పార్టీల నేతలకు మంచి మిత్రుడని, అందరివాడని టీడీపీ పార్లమెంటరీ నేత గల్లా జయదేవ్ అన్నారు. పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని టీడీపీ ఎంపీలు గల్లా జయదేవ్ రామ్మోహన్‌నాయుడు, కనకమేడల రవీంద్రకుమార్ బుధవారం ఆయన నివాసంలో కలసి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గల్లా మాట్లాడుతూ దేశరాజకీయాల్లో వెంకయ్యనాయుడు సుదీర్ఘకాలం పాటు సేవలందించారని, ఇందుకుగాను ఆయనకు పద్మవిభూషణ్ అవార్డును ప్రకటించడం సంతోషించదగిన విషయ మన్నారు. విద్యార్థిదశ నుంచి రాజకీయాల్లో క్రియా శీలంగా ఉంటూ దృఢ సంకల్పం, తిరుగులేని క్రమశిక్షణతో ఉపరాష్ట్రపతి పదవివరకు ఎదిగారన్నారు. ఉపరాష్ట్రపతిగా పదవీకాలం ముగిసిన తర్వాత కూడా వెంకయ్యనాయుడు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం ముప్పై ఏళ్లు వెనక్కు

ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి7: వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి రెండు నెలలు పనిచెయ్యాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం ఉప్పూడి రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తెచ్చి ప్రజలను ఒక్క ఛాన్స్ అంటూ గద్దెనెక్కిన తర్వాత ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందని సమర్థవంతమైన నాయకత్వం లేకపోవటంతో ఏపీని చూసి ఇతర రాష్ట్రాలవారంతా చిన్నతనంగా మాట్లాడుతున్నారన్నారు. రెండు నెలల పాటు కార్యకర్తలు, నాయకులు, కష్టపడి పార్టీ గెలుపుకోసం కృషి చెయ్యాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మురళీధరరావు, మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె రామాంజనేయులు, చింతల సుబ్బారావు, వెంకట్‌యాదవ్, మల్లాది రామకృష్ణ, నిజాంపట్నం జడ్పీటీసీ సుబ్బయ్య, టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, జీవీ నాగేశ్వరరావు, వీరయ్య, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, మేకా వెంకట శివరామకృష్ణ, కేసన రామకృష్ణ పాల్గొన్నారు.

1,26,797 మిర్చి టిక్కీలు విక్రయం

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,30,662 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,26,797 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 87,688 మిర్చి టిక్కీలు నిల్వఉన్నట్లు పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.43 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

పల్నాడు వార్తలు

మాచర్ల • గురజాల • సత్తెనపల్లి • పెదకూరపాడు



ఆర్థికసాయం అందిస్తున్న బ్రహ్మారెడ్డి

దుర్గారావు కుటుంబానికి అండగా ఉంటాం

- రూ.3 లక్షల ఆర్థికసాయం అందించిన బ్రహ్మారెడ్డి

విజయపురిసౌత్, ఫిబ్రవరి 7 : మత్స్యకారుడు దుర్గారావు కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని దుర్గారావు కుటుంబాన్ని బుధవారం బ్రహ్మారెడ్డి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ పోలీసుల దాష్టీకానికి దుర్గారావు మృతి చెందాడని, దీన్ని పోలీసులు ఆత్మహత్యగా చిత్రీకరించారని అన్నారు. దీనిపై ఉన్నత న్యాయస్థానాల్లో పోరాటం చేస్తామన్నారు. టీడీపీ హయాంలో మత్స్యకారుల వేటకు సంబంధించి ఎటువంటి నిబంధనలు విధించలేదన్నారు. మత్స్యకారులు తమ సరుకును యథేచ్ఛగా విక్రయించుకునే వీలు కల్పించామన్నారు. వైసీపీని రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం దుర్గారావు కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించారు. దుర్గారావు పిల్లల చదువుల బాధ్యతను తాను తీసుకోనున్నట్లు బ్రహ్మారెడ్డి తెలిపారు. ఆయన వెంట తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, నేరెటి వీరాస్వామి యాదవ్, పంగులూరి అంజయ్య, వజ్రం నాయక్, రెడ్యానాయక్, దేవుడు, అప్పలరాజు, వెంకటేశ్వర్లు, నూకరాజు, రాహుల్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని పూజలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 7 : పిడుగురాళ్లలో టీడీపీ నాయకులు హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాబోయే ఎన్నికలలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ సిద్ధాంతి సిద్ది రాంబాబు ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా రాజరాజేశ్వరి అమ్మవారి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం పూజా కార్యక్రమాలలో యరపతినేని శ్రీనివాసరావు తనయుడు సాయినిఖిల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, కామిశెట్టి రమేష్, మునగా వెంకట్, పిల్లి చెన్నారావు, నకరికంటి శివ, సుతారు నాగమల్లేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో హోమం కార్యక్రమంలో పాల్గొన్న యరపతినేని సాయినిఖిల్ తదితరులు

నేడు మాచవరంలో టీడీపీ జయహో బీసీ

మాచవరం, ఫిబ్రవరి 7 : మాచవరంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం టీడీపీ జయహో బీసీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ బడిగుంచల వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి గురజాల మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకుడు యరపతినేని శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల వివిధ బీసీ సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.

జలజీవన్ పనులకు శంకుస్థాపన

మాచవరం, ఫిబ్రవరి 7 : మాచవరంలో బుధవారం జలజీవన్ పథకానికి సంబంధించి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్టీ కాలనీలో ప్రతి వీధికి పైపులైన్ ఏర్పాటు చేసి ఇంటింటికి మంచినీటి కుళాయి ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ రాగిడి నరేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిట్టిప్రోలు గురవయ్య, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్, కో-ఆప్షన్ సభ్యులు మహ్మద్ జాని, ఎంపీటీసీ ఆంజనేయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ జంగా పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తదితరులు

మాచవరం, ఫిబ్రవరి 7 : మండలంలోని వేమవరం గ్రామంలో మాజీ ఎంపీటీసీ మీసాల చినజీవరత్నం భార్య శకుంతల ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి బుధవారం వేమవరంలోని మృతుల కుటుంబాలను పరామర్శించి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమవరం ఎంపీటీసీ శానంపూడి లక్ష్మీనరసింహ శ్రీనివాసరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

నేడు పిడుగురాళ్లలో జంగా ఆత్మీయ సమావేశం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 7 : ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి గురువారం సాయంత్రం పిడుగురాళ్లలోని సత్యసాయి కల్యాణ మండపంలో బీసీ సామాజికవర్గ నేతలు, తన అనుచర గణంతో ఆత్మీయ సమావేశం జరుపనున్నారు. కొంతకాలంగా స్థానిక ఎమ్మెల్యే మధ్య పలు అంశాలపై పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్నంతగా విభేదాలు బహిర్గతమయ్యాయి. నేడు ఆత్మీయ సమావేశంలో జంగా తన నిర్ణయాన్ని బహిర్గతం చేయనున్నారు. మొత్తం మీద వైసీపీని వీడే దిశగా తన నిర్ణయం ఉంటుందని జంగా అనుచరుల నుంచి వ్యక్తమవుతుంది.

గురజాల గుండెల్లో.. యరపతినేని

- బలమైన టీడీపీ అభ్యర్థిగా యరపతినేని
- కష్టకాలంలోనూ కార్యకర్తలకు కొండంత అండ
- అనుభవం.. ఆదరణతో ఏడోసారి గురజాల బరిలోకి..
- అధికారమున్నా లేకున్నా ఎమ్మెల్యేగానే పిలుపు



యరపతినేని శ్రీనివాసరావు

గురజాలటౌన్, ఫిబ్రవరి 7: పల్నాడు జిల్లాలో అది ప్రధానమైన నియోజకవర్గం.. టీడీపీ అధిష్ఠానానికి ఇక్కడ సెంటిమెంట్‌తోపాటు ప్రత్యేక అనుబంధం ఉంది.. ఈ కారణంగానే ఒకే వ్యక్తిని వరుసగా ఆరుమార్లు తమ అభ్యర్థిగా బరిలో దింపారు.. మరో మారు కూడా ఆయన్నే ఖరారు చేసినట్లు తెలుస్తోంది.. అపార రాజకీయ అనుభవం.. ప్రజల్లో కొండంత ఆదరణ ఈయనకు ప్రధాన అస్త్రాలు.. అధికారంలో ఉన్నా లేకున్నా నియోజకవర్గ ప్రజలు ఆయన్ను ఎప్పుడూ ఎమ్మెల్యేగా పిలుచుకుంటారు.. ప్రత్యర్థులు సైతం ఆయనకు ఆకర్షితులవడం ఇక్కడ పరిపాటి.. రాజకీయం, కులమతాలకు అతీతంగా అందరినీ అక్కున చేర్చుకోవడమే ఇందుకు కారణం.. ఆయనే పల్నాటి పులిగా పిలుచుకునే యరపతినేని శ్రీనివాసరావు.

రాజకీయ ప్రస్థానం సాగిందిలా..

1994 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధినేతగా ఉన్న ఎన్టీఆర్ తమ పార్టీలో యువతకు ప్రాధాన్యతమిస్తున్నట్లు ప్రకటించారు. ఆ సమయంలో గురజాల నియోజకవర్గంలో రెంటచింతల, గురజాల, మాచవరం, పిడుగురాళ్ల, దాచేపల్లి మండలాలు ఉన్నాయి. రెంటచింతలకు చెందిన యువకుడైన యరపతినేని శ్రీనివాసరావు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ మంచికల్లు శీనన్నగా ఎన్టీఆర్‌ని ఆకర్షించారు. గురజాల నుంచి తమ పార్టీ అభ్యర్థిగా యరపతినేనిని ప్రకటించారు ఎన్టీఆర్. కాంగ్రెస్ పార్టీ తరఫున అప్పటికే రాజకీయ అనుభవమున్న గురజాలకు చెందిన కనకం రమేష్‌దత్తు బరిలోకి నిలిచారు. వీరివురికి ఈ ఎన్నికలే అసెంబ్లీ స్థానానికి మొదటివి కావడం గమనార్హం. 23 వేల ఓట్ల మెజార్టీతో యరపతినేని విజయకేతనం ఎగురవేశారు. 2009 ఎన్నికల్లో టీడీపీ తరఫున రంగంలోకి దిగిన యరపతినేని 10,021 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. రాష్ట్ర విభజన అనంతరం జరిగిన పరిణామాలు, వైఎస్ఆర్ హఠాన్మరణంతో ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి సొంతంగా వైఎస్ఆర్‌సీపీ పార్టీని ఏర్పాటు చేశారు. ఆ తరువాత జరిగిన 2014 ఎన్నికల్లో వైసీపీ తరఫున సీటు దక్కించుకున్న జంగా బరిలోకి నిలవగా యరపతినేని 7,187 ఓట్లతో విజయకేతనం ఎగురవేశారు. తన రాజకీయ ప్రస్థానం మొదలు మూడు దశాబ్దాలుగా టీడీపీ తరఫున యరపతినేని ఒక్కరే బరిలో నిలవడం గమనార్హం. పార్టీ అధిష్ఠానంలో యరపతినేని స్థానమేంటో అర్థం చేసుకోవచ్చు. పార్టీ అధినేత చంద్రబాబు ఇక్కడ పర్యటనకు వచ్చినప్పుడల్లా యరపతినేని ప్రభంజనాన్ని చూసి మంత్రముగ్ధులవడం పరిపాటిగా మారింది.

చరిత్రలో మరుపురాని సంఘటనలు

2013లో రాష్ట్ర విభజన జరిగింది. ఆ సమయంలో టీడీపీ ప్రతిపక్ష హోదాలో ఉంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజల్లోకి వెళ్లాలనే యోచనలో చంద్రబాబు ఉన్నారు. ఎక్కడి నుంచి మొదలుపెట్టాలని పార్టీలోని హేమాహేమీలంతా తలమునకలయ్యారు. ఆ సమయంలో గురజాల ఎమ్మెల్యేగా ఉన్న యరపతినేని ముందుకొచ్చారు. రూట్ మ్యాప్‌తో సహా కార్యక్రమానికి సంబంధించిన అన్నీ సన్నద్ధం చేసుకున్నారు. అయినప్పటికీ ఒకింత కినుక పార్టీ నేతల్లో మెదులుతూనే ఉంది.. కార్యక్రమం విజయవంతం కాకపోతే పరిస్థితి ఏంటని అందరి మదిని తొలుస్తూనే ఉంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలు చంద్రబాబును రాష్ట్రంలోకి అడుగు పెట్టనివ్వం.. ఎలా కార్యక్రమం చేపడతారో చూస్తాం అంటూ సవాల్ విసరడమే ఇందుకు కారణం. సమయం రానే వచ్చింది. చంద్రబాబునాయుడు రాష్ట్ర సరిహద్దు దాచేపల్లి మండలం పొందుగుల వద్దకు చేరుకున్నారు. ఒక్కసారిగా వేలాదిగా జనం. ఎక్కడ చూసినా ఇసుక రాలనంతటి జనం. ఒక్కసారిగా పార్టీ నేతల్లో ఉత్సాహం ఉగ్రూతలూగింది. సుమారు 60 వేల మందితో యరపతినేని చంద్రబాబుకు రాష్ట్రంలోకి ఘన స్వాగతం పలికింది. కార్యక్రమం అఖండ విజయం సాధించడంతో రాష్ట్రమంతా యరపతినేని పేరు మారుమోగింది. అదే ఉత్సాహంతో 2014 ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించింది. ఈ గెలుపునకు కారణం యరపతినేని అంటూ చంద్రబాబే స్వయంగా ప్రకటించారు. ఎవరూ చేయని సాహసం చేసి పార్టీ బలోపేతానికి పాటుపడ్డావు అంటూ యరపతినేనిని పొగడ్తలతో ముంచెత్తడం గమనార్హం.

అడుగడుగునా ఆదరణ

ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉన్నప్పటికీ పార్టీ నేతలు, కార్యకర్తలకూ యరపతినేని అండగానే ఉన్నారు. పార్టీ నేతలు చేపట్టిన ప్రతి కార్యక్రమానికి హాజరవుతూ అందరినీ కలుపుకొని పోతున్నారు. నియోజకవర్గంలో వైసీపీ నేతల అరాచకాలను ఎండగడుతూ వస్తున్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి మినహా జరిగిందేమీ లేదని ప్రజలు చెబుతున్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా ఉంటూ నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆపద వస్తే యరపతినేని ఆదుకుంటారనే భరోసా కల్పిస్తూ ముందుకు సాగిపోతున్నారు. పార్టీ అధిష్ఠానం సైతం ఈ సారి యరపతినేనినే బరిలో దింపే కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోంది. యేడాది క్రితం గురజాల పర్యటనకు వచ్చిన చంద్రబాబు వైసీపీ అరాచకాలను ఎండగట్టేందుకు ఇక్కడ యరపతినేనిని పెట్టానని చెప్పుకొచ్చారు. యువగళం పాదయాత్రలో సైతం పిడుగురాళ్ల బహిరంగ సభలో లోకేష్ గురజాల నియోజకవర్గంను అభివృద్ధి చేసిన పల్నాటి పులి యరపతినేనిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు కూడా.!

తెలుగుదేశంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం : కన్నా



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 7 : టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని గండ్లూరులో బుధవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధానిగా కొనసాగాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు రావాలన్నా, రాష్ట్రాభివృద్ధి జరగాలన్నా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జనసేన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్ళి టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టనున్న పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన కన్నాకు మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. స్థానిక చర్చిలో కన్నా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రచారంలో టీడీపీ పరిశీలకులు తాతా జయ ప్రకాష్ నారాయణ, సర్పంచ్ పేరం శకుంతల ఆంజనేయులు, నాయకులు ఆళ్ళ అమరేశ్వరరావు, నలజాల కృష్ణ ప్రసాదు, నలజాల సత్యనారాయణ, బంగారుపల్లి అచ్చయ్య, గొల్లపల్లి నాగుల్ మీరా, నలజాల అప్పారావు, మందడపు వినయ్ కుమార్, గింజుపల్లి సాయి, దుగ్గెంపూడి శేషయ్య, కట్టా రమేష్, గొర్రెపాటి సుశీల, అహల్యారాణి, ఆండాలు, సంగెపు సీత, గురజాల నాగమల్లేశ్వరి, కే సంధ్య, పీ అంబిక తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీకి బీసీలే వెన్నెముక : కుర్రి

రెంటచింతల, ఫిబ్రవరి 7 : టీడీపీకీ బీసీలే వెన్నెముక అని, వారిని రాజకీయంగా ఒక స్థాయికి తీసుకురావడంలోను, చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించడంలో దివంగత ఎన్టీ రామారావు విశేషంగా కృషి చేశారని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి అన్నారు. రెంటచింతలలోని ఆంజనేయస్వామి మాణ్యానికి చెందిన సీనియర్ బీసీ నేత రాంపాటి కొండ(40) మృతదేహాన్ని బుధవారం ఆయన సందర్శించి నివాళులర్పించారు. రెంటాల గ్రామానికి చెందిన చేర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షుడు అబ్బిరెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు సుమంత్‌రెడ్డి, టౌన్ అధ్యక్షులు ఎం.రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, రైతు విభాగం అధ్యక్షుడు తుమ్మా జోజిరెడ్డి, బి.రామకృష్ణ, మట్టయ్య, మాణ్యం శ్రీను, బుజ్జి, రంగాచారి, మొండెద్దు శౌర్రెడ్డి, రాయపరెడ్డి, జ్ఞానయ్య, మల్లయ్య యాదవ్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతుకు తీవ్ర గాయాలు

రెంటచింతల, ఫిబ్రవరి 7 : మండలంలోని మిట్టగుడిపాడు గ్రామానికి చెందిన మంచి సత్యం తన వరి పొలంలోని బోర్ మోటార్‌కు ఎడ్జ్ ఫీజ్ వేస్తున్న సమయంలో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆయనను కుమారుడు లక్ష్మీనారాయణ హుటాహుటీన రెంటచింతలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరుకు తరలించారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

వెల్దుర్తి, ఫిబ్రవరి 7: ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయిన లారీ డివైడర్‌ను ఢీకొనగా ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలైన సంఘటన వెల్దుర్తిలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మళ్ల చిన చలమయ్య గ్రామంలోని జాతీయ ప్రధాన రహదారి డివైడర్‌పై కూర్చున్నాడు. ఈ సమయంలో యరగొండపాలెం నుంచి మాచర్ల వైపు లారీ వస్తుండగా అదే సమయంలో వెల్దుర్తి గ్రామంలో నుంచి ఓ ద్విచక్ర వాహనం ప్రధాన రహదారిపైకి వచ్చింది. ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి లారీ డివైడర్‌ను ఢీకొంది. డివైడర్‌పై కూర్చున్న చలమయ్య చేతికి బలమైన గాయమైంది. క్షతగాత్రుడ్ని 108 అంబులెన్స్‌లో మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నుంచి కాంగ్రెస్‌లోకి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 7 : పట్టణంలోని పాతూరుకు చెందిన 20 వైసీపీ కుటుంబాలు బుధవారం ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి వారికి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు.

జనసేన, టీడీపీ కూటమి అధికారంలోకి రావాలి : బొర్రా

నకరికల్లు, ఫిబ్రవరి 7 : రానున్న సాధారణ ఎన్నికల్లో జనసేన, టీడీపీ కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చేపట్టాలని కోరుతూ సత్తెనపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బొర్రా వెంకట అప్పారావు దంపతులు చేజర్ల కపోతేశ్వరాలయంలో చేస్తున్న రాజశ్యామల యాగం బుధవారం మూడో రోజుకు చేరుకుంది. మహారుద్ర, శత సహస్ర మహాశక్తి సహిత పూజా క్రతువులను నిర్వహించారు. కపోతేశ్వరస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. యాగంలో భాగంగా గోపూజ, గురు పార్థన, మండప పూజలు చేశారు. చండీ పారాయణం, రాజశ్యామల జపం, రుద్రాభిషేకం, రాజ శ్యామల హోమం, సుదర్శన హోమం, మహాలక్ష్మి హోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

అయ్యా... జగన్ మా ఊరు ఒకసారి రండి

- అధికారుల ఎదుట గిరిజన బిడ్డలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 7: అయ్యా.....జగనన్నా....ఓసారి మా ఊరు రండి... అభివృద్ధికి నోచుకోక గుక్కెడు మంచినీరు, రహదారులు, కనీసం సమాచారం అందే సౌకర్యాలు లేక తాము పడుతున్న ఇబ్బందులు ఏమిటో చూడువు అంటూ పలువురు మహిళలు, గ్రామస్తులు అధికారుల ఎదుట విన్నవించుకున్నారు. ఒకరిద్దరు అయితే మరో అడుగు ముందుకేసి మా సమస్య జగనన్నకే తెలియడం లేదని, రేషన్ బియ్యం కావాలన్నా....ఫోన్ చేసుకోవాలన్నా.....సిగ్నల్ లేక ఐదారు కిలోమీటర్లు దూరం నడవాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదొక దట్టమైన నల్లమల అటవీ ప్రాంతం. గుత్తికొండ గ్రామానికి విసిరేసినట్లుగా దూరంగా వుండే వేమగిరి ప్రాంతం గత నలభై ఏళ్లుగా ఏ అభివృద్ధికి నోచుకోవడం లేదని అక్కడ నివశిస్తున్న వారందరూ అధికారులకు విన్నవించారు.

డీఈవోగా వెంకటేశ్వర్లు నియామకం

నరసరావుపేట, ఫిబ్రవరి 7 :డీఈవో కే.శామ్యూల్‌ను బదిలీ చేస్తూ విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటేశ్వర్లు డీఈవోగా నియమితులయ్యారు. శామ్యూల్‌ను కర్నూలు డీఈవోగా బదిలీ చేశారు.

దొడ్లేరులో వ్యక్తి ఆత్మహత్య

క్రోసూరు, ఫిబ్రవరి 7 : మండలంలోని దొడ్లేరులో నంద్యాల గురవయ్య అనే వ్యక్తి(55) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం రాత్రి నుంచి కన్పించకుండాపోయిన గురవయ్య బుధవారం ఉదయం దొడ్లేరులోని హిందూ శ్మశాన వాటికలో మృతదేహంగా కన్పించాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొద్దిపాటి వ్యవసాయం చేసేవాడని, నష్టాలు రావటంతో ఇటీవల మానసిక వేదనతో ఉన్నాడని స్థానికులు తెలిపారు. గురవయ్య మృతదేహాన్ని కొనుగొన్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారు వివరాలు నమోదు చేసుకున్నారు.

జంగా ఆత్మీయ సమావేశానికి జనసమీకరణ

దాచేపల్లి, ఫిబ్రవరి 7: రెండుసార్లు ఎమ్మెల్యేగా.. ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్న జంగా కృష్ణమూర్తి గురువారం పిడుగురాళ్లలో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నారు. సమావేశానికి దాచేపల్లి మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన వర్గాలతో పాటు ఇతర అభిమానులను, నాయకులను పిలిపించుకొని సమావేశానికి హాజరుకావాల్సిందిగా ఆహ్వానిస్తున్నారు. అధిక సంఖ్యలో పార్టీ నాయకులను, కార్యకర్తలను తరలించి తన బలప్రదర్శనను నిరూపించుకోవడానికి జంగా సర్వశక్తులను ఒడ్డుతున్నారు. ఒక్క గురజాల నియోజకవర్గమే కాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తన అభిమానులను, సామాజికవర్గానికి చెందిన నాయకులను కూడా జంగా సభకు ఆహ్వానించిన పరిస్థితి వుంది.



గుంటూరులో టీడీపీ శ్రేణులతో మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్

టీడీపీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలి : కొమ్మాలపాటి

అచ్చంపేట, ఫిబ్రవరి 7 : తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపునిచ్చారు. శ్రీధర్ ఇంటి వద్ద బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అవినీతివంతమైన ప్రభుత్వమని, వైసీపీ చేస్తున్న దుర్మార్గాలను ప్రజలకు తెలియజేస్తూ చైతన్యవంతులను చేయాలన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో బూత్ కమిటీ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో కలసికట్టుగా ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ఓటరు లిస్టులో తేడాలు ఉంటే ఎన్నికల అధికారికి తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో అచ్చంపేట మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదంతో పాటు కన్యదార వసంతరావు, పెనుముచ్చు రామకృష్ణ, బత్తుల శ్రీనివాసరావు, రేపూడి తోమాస్, తిరువాయిపాటి ఆంజనేయులు, కోటేశ్వరరావు, నెట్టెం హరిబాబు, షేక్ జానీ, షేక్ బాబు, కరిముల్లా, ఏసుపోగు నాగయ్య, బత్తుల గోపీ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు నీరు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం

అచ్చంపేట, ఫిబ్రవరి 7 : రైతులకు ఆరు తడులు కూడా అందించలేని వైసీపీ అసమర్థ ప్రభుత్వమని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని రుద్రవరం గ్రామంలో బుధవారం మన ఇంటికి మన కొమ్మాలపాటి కార్యక్రమం జరిగింది. తెలుగుదేశం, జనసేన మేనిఫెస్టోను ఇంటింటికి వెళ్ళి ప్రచారం నిర్వహించారు. అనంతరం గోడ పత్రికలను అంటించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, కొండరాజు బ్రహ్మారాజు, జువ్వా రామారావు, బత్తు శ్రీనివాసరావు, బత్తుల వెంకటరావు, కోటపాటి అప్పారావు, గడ్డం ఆంజనేయులు యడ్లపల్లి బుచ్చిబాబు, చిమటా శ్రీనివాసరావు, చల్లా వీర రాఘవయ్య, నంబుల వసంతరావు, ఘంటా వీరయ్య, ఎస్‌కే కాసుల, ఆంజనేయులు పాల్గొన్నారు.

పాపాయపాలెంలో 'మీ ఇంటికి.. మీ కొమ్మాలపాటి' కార్యక్రమం

బెల్లంకొండ, ఫ్రిబవరి 7 : మండలంలోని పాపాయపాలెం గ్రామంలో బుధవారం రాత్రి మీ ఇంటికి మీ కొమ్మాలపాటి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ అన్నారు. పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సూచించారు. ఇంటింటికి తిరిగి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వెన్నా వెంకటరెడ్డి, వైస్ సర్పంచ్ శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, బీసీ సంఘం మండల అధ్యక్షుడు గుంజా గంగారావు, బ్రహ్మారెడ్డి, గుడిసె కొండయ్య, రాజేష్, నాగమణి బాయి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసమర్థ పాలనతో రాష్ట్రంలో అస్తవ్యస్తం



పరసలో మన ఇంటికి మన కొమ్మాలపాటి కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు

పెదకూరపాడు, ఫిబ్రవరి 7 : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసమర్థ పాలనతో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయని టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అన్నారు. మండలంలోని పరస గ్రామంలో బుధవారం రాత్రి మన ఇంటికి మన కొమ్మాలపాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ ప్రకటించిన మహాశక్తి మినీ మేనిఫెస్టోను, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మండల టీడీపీ నేతలు మద్దినేని వెంకట సత్యనారాయణ, నంబూరు నాగేశ్వరరావు, అంద్ర కొండలు, సరిపూడి శ్రీనివాసరావు, నూతలపాటి మల్లి, సరిపూడి సుధాకర్, నెల్లూరి మల్లిఖార్జున్, షేక్ దిలీప్, వెల్లలచెరువు సురేష్, రాయపాటి శ్రీను, ఏటుకూరి సురేష్, చెన్నంశెట్టి శివాజీ, షేక్ షబ్బీర్, మీరావలి, సరిపూడి శివకృష్ణ, కోంద్రు హరినాథ్, రాళ్ళపల్లి సాంబ శివరావు, మన్నెం నాగేశ్వరరావు, రంగా పూర్ణ, సాధినేని వెంకట కృష్ణ, రాళ్ళపల్లి నవీన్, పరస సర్పంచ్ సరిపూడి తిరుపతమ్మ, రాష్ట్ర, జిల్లా నేతలు గంగినేని లీలావతి, షేక్ ముంతాజ్, సరిపూడి కృష్ణ కుమారి, గుమ్మడి పుష్పలత ఉన్నారు.

భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 7 : ప్రజల ఆస్తులకు భద్రత లేని భూ హక్కుల చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ స్థానిక కోర్టు ప్రాంగణం వద్ద న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారానికి రెండో రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరాన్ని సీనియర్ న్యాయవాది పీవీఎస్ఎస్ శాస్త్రి ప్రారంభించారు. సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ డాక్యుమెంట్ రైటర్ అసోసియేషన్ ప్రతినిధులు దీక్షకు మద్దతు ప్రకటించారు. దీక్షలో న్యాయవాదులు చిలుకా చంద్రశేఖర్, ఎస్.బాబూరావు, దివ్వెల శ్రీనివాస్, వెంకట కోటయ్య, సంగీతరావు, శేషయ్య, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

దళితులపై జగన్ చూపేది కపట ప్రేమ

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 7 : దళితులపై ముఖ్యమంత్రి జగన్ చూపేది కపట ప్రేమ అని దళిత నాయకులు అన్నారు. సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాలతో మండలంలోని నందిగామలో బుధవారం దళిత చైతన్య యాత్ర నిర్వహించారు. దళిత నాయకులు మాట్లాడుతూ దళితులను జగన్ ఎలా నయవంచన చేశాడో 27 ఎస్సీ పథకాల రద్దుతో అర్థమవుతుందన్నారు. పథకాలు రద్దు చేసిన కరపత్రాలను దళిత నాయకులు ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బలిజేపల్లి విజయకుమార్, గడ్డం రమేష్, గుంటూరు ఆశీర్వాదం, బొజ్జా కాంతారావు, బందారు నాగరాజు, చిలకా చంటి బాబు, ఎలిసాల వెంకటరావు, బందారు ఏలియా, గొలమాల ప్రభుదాసు, జంగాల శ్రీనివాస్, చేవూరి దేవసహాయం పాల్గొన్నారు.

దోపిడీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం

- మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఏపూరి

క్రోసూరు, ఫిబ్రవరి 7 : రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా దోపిడీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు అన్నారు. క్రోసూరులో బుధవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంతో పాటు మన ఇంటికి మన కొమ్మాలపాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య, టీడీపీ నాయకులు కొమ్మినేని సతీష్, టీడీపీ పట్టణ అధ్యక్షులు మల్లాల రామాంజనేయులు, ఎస్సీ సెల్ నాయకులు దుడ్డుల యోహాన్, తెలుగు యువత నాయకులు షేక్ సలాం, బీసీ సెల్ నాయకులు దూళ్ళ సాంబశివరావు, మన్నెం శ్రీనివాసరావు, కొడవటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహన ప్రమాదంలో యువకుడి మృతి

అమరావతి, ఫిబ్రవరి 7 : స్థానిక పెద్దింటమ్మ ఆలయం సమీపంలో ద్విచక్రవాహనంపై వెళుతూ ప్రమాదవశాత్తు వాహనం బోల్తా పడిన సంఘటనలో ధరణికోట గ్రామానికి చెందిన వల్లభనేని శివనాగరాజు (32) అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. శివనాగరాజు తల్లి ఉమాదేవి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాదరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాలల పరిరక్షణలో భాగస్వాములు అవ్వాలి

- బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

అమరావతి, ఫిబ్రవరి 7: సమాజంలో బాలల పరిరక్షణకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండల పరిధిలోని అత్తలూరు గ్రామంలోని ఆర్గానిక్ కేంద్రంలో జరిగిన బాలల పరిరక్షణపై బుధవారం వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి సీడీపీవో పి.స్వర్ణకుమారి అధ్యక్షత వహించారు. బాల్యవివాహాలు చేసి బిడ్డల భవిష్యత్ అంధకారం చేయవద్దని, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎం.హనుమంతరావు, ఎంఈవోలు శ్రీనివాసరావు, శివబాబు, ప్రసాదరావు, వైద్యాధికారి రవిబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్, కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఒక్క కేజీ కందిపప్పు ఎన్ని నెలలు సర్దుకు తినాలి ?

● గ్రామాల్లో రేషన్ కార్డుదారుల ఆవేదన

శావల్యాపురం, ఫిబ్రవరి 7: రేషన్ దుకాణాల్లో ఐదునెలలు కందిపప్పు ఇవ్వకుండా మధ్యలో జనవరి నెలలో మాత్రమే ఒక్క కేజీ కందిపప్పు ఇచ్చారని, మరలా ఫిబ్రవరి నెలలో కందిపప్పు ఇవ్వడం మానేశారని, ఒక్క కేజీ కందిపప్పును మేము ఎన్ని నెలలు సర్దుకొని తినాలని గ్రామాల్లో రేషన్ కార్డుదారులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. జనవరిలో వచ్చిన కందిపప్పు కూడా రేషన్ పంపిణీ ప్రారంభమైన తర్వాత ఆలస్యంగా రావడంతో కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు బియ్యంతో పాటు కార్డుదారుల చేత వేలిముద్రలు వేయించుకొని కందిపప్పు ఇవ్వకుండానే గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకున్నారని కార్డుదారులు విమర్శిస్తున్నారు. మండలంలోని మతుకుమల్లిలో జనవరిలో కూడా తమకు కందిపప్పు ఇవ్వలేదని స్థానికులు వాపోయారు. ఫిబ్రవరికి గాను కందిపప్పు, గోధుమపిండికి డీడీలు చెల్లించమని సివిల్ సప్లై అధికారులు చెప్పడంతో మండలంలో 15మంది రేషన్‌డీలర్లు వేలాది రూపాయలు అప్పులు తెచ్చి డీడీలు చెల్లించారు. కానీ ప్రభుత్వం వారికి కందిపప్పు, గోధుమపిండి సరఫరా చేయకపోవడంతో తెచ్చిన అప్పునెలా తీర్చాలని రేషన్ డీలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర రూ.150 ఉండడంతో కందిపప్పు కొనడం పేదకుటుంబాలకు భారంగా మారిందని, రేషన్ షాపులలో కందిపప్పు కేజీ రూ.66కే సరఫరా చేస్తారని ఆశపడితే ప్రభుత్వం ఇలా మొండిచేయి చూపించిందని కార్డుదారులు వాపోతున్నారు. దీనిపై సీఎస్‌డీటీ విద్యాసాగర్‌ను వివరణ కోరగా ప్రభుత్వం వద్ద కందిపప్పు స్టాకు లేకపోవడంతో సరఫరా చేయలేకపోయామన్నారు. గోధుమపిండి రేషన్ షాపులకు పంపలేదని ఓవైపు రేషన్ డీలర్లు చెబుతుంటే ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి మాత్రం గోదుమపిండి రేషన్ షాపులకు పంపించామని చెప్పడం గమనార్హం.

నేత్రదానం అభినందనీయం

● పల్నాడు జిల్లా కోఆర్డినేటర్ చలపతిరావు



సుబ్బారావు (ఫైల్)

వేల్పూరు(శావల్యాపురం), ఫిబ్రవరి 7: చనిపోయిన వ్యక్తి నేత్రాలను మరొకరికి దానం చేసి వారికి చూపును ప్రసాదించడం అభినందనీయమని అమ్మ నేత్ర అవయవ శరీరదాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కోఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు అన్నారు. మండలంలోని వేల్పూరుకు చెందిన గోనుగుంట్ల సుబ్బారావు బుధవారం గుండెపోటుతో మృతి చెందగా ఆయన కుటుంబసభ్యులు అతడి నేత్రాలను దానం చేశారు. చలపతిరావు ఇచ్చిన సమాచారం మేరకు పెదకాకాని శంకర్ ఆసుపత్రి ఐ-బ్యాంక్ వైద్యులు సుబ్బారావు కళ్లలోని కార్నియా పొరను సేకరించారు. సుబ్బారావు మృతదేహాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బారావు కుటుంబసభ్యులు గోనుగుంట్ల విజయలక్ష్మి, రమేష్, రామసుబ్రహ్మణ్యం, రాజ్యలక్ష్మి, సుబ్బాయమ్మ, శివప్రసాద్, శ్రీనివాసరావులను అభినందించారు.

జనసేన పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలి

● ఎన్ఆర్ఐ వెంకట్

వినుకొండటౌన్, ఫిబ్రవరి 7: ఎన్ఆర్ఐ వెంకట్ పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ముందుగా జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కొంజేటి నాగశ్రీనురాయల్ మర్యాదపూర్వకంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ తన లైఫ్‌స్టైల్‌కు అనుగుణంగా జనసేన పార్టీని బలోపేతం చేయడమే తన లక్ష్యమంటూ కార్యకర్తలకు సూచించారు. అనంతరం ఆయనను జనసేన పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని అభినందించారు.

వేల్పూరులో రెండుచోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటు

వేల్పూరు(శావల్యాపురం), ఫిబ్రవరి 7: మండలంలోని వేల్పూరు గ్రామంలో ప్రజలకు నెలరోజులుగా విషజ్వరాలు సోకి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎట్టకేలకు వైద్యాధికారులు స్పందించి గ్రామంలో రెండు చోట్ల బుధవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారి రాధాకృష్ణన్ గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాలతో బాధపడుతున్న 100 మంది అనుమానితులకు డెంగ్యూ, మలేరియా వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులతో మాట్లాడి వివరాలు సేకరించారు. వైద్యాధికారి గ్రామంలో పర్యటించి మురికి కాలువలు, దోమలు నిల్వ ఉండే ప్రదేశాల ను పరిశీలించి వెంటనే బ్లీచింగ్ చల్లించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. వైద్యశిబిరాలను ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి సందర్శించారు. గ్రామంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి జ్వరాలు పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, కొత్త కేసులు వస్తే వైద్యాధికారులకు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. ఇన్‌చార్జి సర్పంచ్ బీర్నీడి రత్నగిరి, పంచాయతీ కార్యదర్శులు అశోక్‌చౌదరి, యుగంధర్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు సర్టిఫికెట్ల పంపిణీ

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 7: పల్నాడు జిల్లాలోని ఆశా కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారికి బుధవారం పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ రవి సర్టిఫికెట్లను అందజేశారు. గుంటూరులోని మహిళా ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలు వారికి కేటాయించిన జనాభాలో మాతా శిశు సంరక్షణ సంక్షేమ కార్యక్రమాలన్నీ మంచిగా నిర్వహించటానికి ఈ శిక్షణ ఉపయోగ పడుతుందన్నారు. ఆశాలు అందరికీ నులి పురుగుల నివారణ, పల్స్ పోలియో కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో సురేఖ, సురేష్, ఆశా కార్యకర్తలు, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.


చిన్నగురునాథంకు అభినందనలు

వినుకొండ, ఫిబ్రవరి 7: ఇటీవల పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన గుడిపాటి చిన్నగురునాథంను పట్టణంలోని కొండమెట్ల వద్ద ఉన్న వరసిద్ధి వినాయక దేవస్థాన కమిటీ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నగురునాథం మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి ప్రతిఒక్కరూ టైమ్ కేటాయించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పేరూరి శ్రీనివాసరావు, గజవల్లి శ్రీనివాసరావు, బైసాని సుబ్బారావు, దివ్వెల పుల్లారావు, సనిశెట్టి సుబ్బారావు, సదాశివరావు, కూచి రామాంజనేయులు, మానుకొండ రమణారెడ్డి, పగడాల లక్ష్మీనారాయణ, పులిపాటి వెంకటేశ్వర్లు, భీంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కర్లకుంటలో గడప గడపకు వైసీపీ కార్యక్రమం

రొంపిచర్ల, ఫిబ్రవరి 7: మండలంలోని కర్లకుంట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ విష్కరణ కార్యక్రమంలో ఎంఎల్‌సీ చంద్రగిరి ఏసురత్నంతో కలసి పాల్గొన్నారు. రైతు భరోసా కేంద్రం, సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజ లకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. అభివృద్ధి జరగాలంటే మరలా వైసీపీ అధికారంలోకి రావాలని పేర్కొన్నారు.

బ్లడ్ గ్రూప్ శాంపిల్స్ సేకరణ



బ్లడ్ శాంపిల్స్ సేకరిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది

వినుకొండ, ఫిబ్రవరి 7: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం బ్లడ్ గ్రూప్ శాంపిల్స్ సేకరణ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో మొత్తం 270 మంది విద్యార్థులు పాల్గొనగా వారి బ్లడ్ గ్రూపుల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మానస, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి బెల్లంకొండ ప్రసాద్, ప్రిన్సిపాల్ సురేష్, కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే సంతాపం

రొంపిచర్ల, ఫిబ్రవరి 7: మండలంలోని రెడ్డిపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దుద్దుకుంట నారాయణరెడ్డి మృతికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం సంతాపం తెలిపారు. పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో ఇటీవల మృతి చెందిన వరికూటి ఓబులరెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిజాయితీ పరుడని జగన్‌రెడ్డే రుజువు చేశాడు

● నారా భువనేశ్వరి

● మృతుల కుటుంబాలకు పరామర్శ



యడ్లపాడులో మహిళలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న భువనేశ్వరి

యడ్లపాడు, ఫిబ్రవరి 7 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నిజాయితీ పరుడని జగన్‌మోహన్‌రెడ్డే రుజువు చేశారని టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. యడ్లపాడు గ్రామంలో చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి టీవీ చూస్తూ గుండెపోటుతో మృతి చెందిన మొగిలి సత్యనారాయణ కుటుంబాన్ని బుధవారం ఆమె పరామర్శించారు. రూ.3 లక్షల ఆర్థిక సాయం చెక్కును కుటుంబసభ్యులకు అందజేసి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం చంద్రబాబుపై పెట్టిన కేసులన్నీ అక్రమ మైనవేనని ప్రపంచమంతా తెలుసన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు ఇప్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే వాటిలో అవినీతి జరిగిందని అక్రమ కేసు పెట్టి 53 రోజులు జైల్లో నిర్బంధించారన్నారు. ఆయనపై పెట్టిన కేసుల్లో జగన్ ప్రభుత్వం ఒక్క ఆధారాన్ని కోర్టుకు ఇవ్వలేక పోయిందన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్, యువత కోసం చంద్రబాబు నాయుడు పెద్ద పెద్ద సంస్థలను తెచ్చారన్నారు. పార్టీ కోసం, నాయకుడి కోసం ప్రాణాలు వదిలిన కార్యకర్తలను ఆదుకోవటం తన కర్తవ్యం అన్నారు. ఆమె వెంట ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, నన్నపనేని రాజకుమారి, పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, వెంకట కుమారి, టీడీపీ, జనసేన నాయకులు కుర్రా రత్తయ్య, గోనుగుంట్ల శివ, తోట రాజా రమేష్, సామినేని సాయిబాబు తదితరులు ఉన్నారు.

రొంపిచర్ల, ఫిబ్రవరి 7: మండలంలోని అన్నవరంలో ఇద్దరు మృతుల కుటుంబాలను నారా భువనేశ్వరి బుధవారం పరామర్శించారు. గ్రామంలోని కోడెల శివప్రసాదరావు విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన గుత్తా ఉదయ్‌శేఖర్, దారి చిన బిక్షాలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబసభ్యుల స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. ఇరు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3 లక్షలు చొప్పున చెక్కులను అందజేశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, టీడీపీ ఇన్‌చార్జ్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, నల్లపాటి రాము, కోడెల శివరామ్, కడియాల లలితసాగర్ పాల్గొన్నారు.



యడ్లపాడులో సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న భువనేశ్వరి



రొంపిచర్ల మండలం అన్నవరంలో గుత్తా ఉదయ శేఖర్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

అడ్డ దారుల్లో గెలవాలనే వైసీపీ దొంగ ఓట్ల నాటకాలు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

● ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 7: ఓటమి కళ్ళ ముందు కన్పిస్తున్నా ఇంకా అడ్డ దారుల్లో గెలవాలనే వైసీపీ దొంగ ఓట్ల నాటకాలు కొనసాగిస్తుందని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. నేరుగా ఎన్నికల సంఘం కార్యాలయంలోనే ఐ ప్యాక్ ఏజెంట్ల ద్వారా డేటా చేశారన్న ఆరోపణలు వారి కుట్రలకు నిదర్శనం అన్నారు. ప్రతి నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలో ఓట్లపై ఇప్పటికీ వేల సంఖ్యలో తమకు అనుమానాలున్నాయని స్పష్టం చేశారు. బుధవారం ప్రత్తిపాటి సమక్షంలో 29వ వార్డుకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ మేరకు స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రత్తిపాటి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైసీపీ అధికారంలో ఉన్నా కూడా తమకు ఎటువంటి మేలు జరగలేదని, పట్టణం కూడా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, అందుకే టీడీపీలో చేరుతున్నామని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేస్తామని వారు అన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు ఈ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు దిశగా అందరూ కృషి చేయాలని కోరారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థిక సాయం

మండలంలోని ఎడవల్లి గ్రామానికి చెందిన తాళ్ళూరి శ్రీనివాసరావు ఇటీవల మరణించాడు. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ప్రత్తిపాటి పుల్లారావు వారి కుటుంబానికి ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.20వేలు ఆర్థిక సాయం టీడీపీ నాయకుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, ఎర్రమాసు రవి, రమేష్, శ్రీనివాసరావు, లక్ష్మయ్య, శివ, శ్రీరామ్మూర్తి, శివ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

11న ప్రత్తిపాటి ఫౌండేషన్ కంటి వైద్యశిబిరం

చిలకలూరిపేట పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్‌లో ఈనెల 11వ తేదీ ఆదివారం ఉదయం 9గంటల నుంచి ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 34వ ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం తన నివాసం వద్ద టీడీపీ నాయకులతో కలసి వైద్య శిబిరం పోస్టర్లు ఆవిష్కరించారు. శంకర్ కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ఆయన వివరించారు. ఈ శిబిరంలో ఎంపికైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

తప్పుల తడకగా జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలు



పిచికలపాలెంలో ఆధారాలు చూపుతున్న గాలి వెంకటేశ్వర్లు

పిచికలపాలెం(శావల్యాపురం), ఫిబ్రవరి 7: రీసర్వే పూర్తయితే గతం లోని భూసమస్యలన్నీ తొలగిపోతాయని అధికారులు చెబుతుంటే నిజమేనని నమ్మిన రైతులకు చివరికి నిరాశే మిగిలింది. రెండో విడత రీసర్వేలో భాగంగా మండలంలోని పిచికలపాలెంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతుల పొలాలను రీసర్వే చేసి ప్రభుత్వం అందించిన జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలు తప్పుల తడకగా ఉన్నాయి. పొలాలు కొలిచిన పిమ్మట రైతులకు అందించిన 9(2)పత్రాలలోని విస్తీర్ణాలకు, శాశ్వత భూహక్కు పత్రాల్లో నమోదైన విస్తీర్ణాలకు పూర్తిగా వ్యత్యాసాలుండడంతో రైతులలో ఆందోళన నెలకొంది. గ్రామానికి చెందిన పులికొండ బ్రహ్మయ్యకు ఎకరం పొలం ఉండగా రీసర్వేలో మూడెకరాలున్న ట్లుగా నమోదు చేసి పాసుపుస్తకం ఇచ్చారు. దుగ్గెంపూడి పూర్ణమ్మకు 1.60 ఎకరాలుండగా తిరువీధి పూర్ణమ్మ అంటూ ఇంటిపేరు మార్చి 9(2)పత్రాన్ని ఇచ్చి పాసుపుస్తకాన్ని మాత్రం ముంద్రు పూల్లయ్య పేరు తో ఇచ్చారు. ముంద్రు చిన్న ఆంజనేయులుకు 1.25 ఎకరాలు ఉండగా అతని పేరుకు బదులుగా ఎన్నో ఏళ్ల క్రితం చనిపోయిన కనమర్లపూడి సర్పంచ్ ముంద్రు వెంకయ్య పేరుతో ఆయనకు పాసుపుస్తకాన్ని ఇచ్చా రు. గాలి వెంకటేశ్వర్లుకు రీసర్వేకి ముందు ఖాతానెంబర్ 221తో 8.27 ఎకరాలు ఉండగా ఆన్‌లైన్‌లో కూడా నమోదై ఉంది. రీసర్వే తర్వాత ఇచ్చిన పాసుపుస్తకంలో 4.27ఎకరాలు మాత్రమే నమోదు చేశారు. మిగిలిన పొలంలో ఆయన తల్లి బుచ్చమ్మకు గతంలో పొలం లేకపోయి నా ఆమె పేరుతో 1.30ఎకరాలు, గాలి అయ్యన్న కుమారుడు వెంకటేశ్వ ర్లు పేరుతో రెండెకరాలు, శావల్యాపురానికి చెందిన పద్మావతి పేరుతో 0.47సెంట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గాలి వెంకటేశ్వర్లు గతంలో బ్యాంకు లోన్ తీసుకొని ఉండగా ఇప్పుడు విస్తీర్ణంలో వ్యత్యాసాలుండడంతో మిగిలిన పొలానికి ఆధారాలు చూపిస్తేనే లోన్ ఇస్తామని బ్యాం కు అధికారులు చెబుతున్నారని వాపోయాడు. దీనిపై వీఆర్వో అమలను అడగ్గా రీసర్వేలో తప్పుల సవరణకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని, అప్పుడు సవరణ చేస్తామని చెప్పినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. రైతుల వద్ద ఆధార్, బ్యాంకు పుస్తకం, ఫోటోలైతే తీసుకొన్నారే గానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి కొందరికి అవేమీ నమోదు చేయకుండానే పాసుపుస్తకాలిచ్చారని, అదేమని అడిగితే త్వరలో సవర ణ చేస్తామని చెబుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా ఫైనాన్స్ సంస్థలు

నాదెండ్ల, ఫిబ్రవరి 7: ఫైనాన్స్ సంస్థల వారు ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పల్నాడు జిల్లా వినియోగ దారుల హక్కుల ప్రొటక్షన్ ఫోరం సంస్థ కార్యదర్శి మురికిపూడి ప్రసాదు, సీపీఐ నేత ఆరాధ్యుల రామకృష్ణ అన్నారు. ఒక ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ ఒత్తిడితో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చిలకలూరిపేట పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్రామయ్యను బుధవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పు ఇచ్చిన ఏ సంస్థ అయినా అప్పు తీసుకున్న వారిపై దాడులకు పాల్పడటం, సెల్ ఫోన్ లాక్కోవటం బెదిరించటం లాంటివి సరైన పద్ధతి కాదన్నారు. వేధింపులకు గురి చేసిన సంబంధిత వ్యక్తులపై విచారణ జరిపి అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.

మోటార్ల పంపిణీ

నూజెండ్ల, ఫిబ్రవరి 7: మండలంలోని వైఎస్సార్ జలకళ లబ్ధిదారులకు వ్యవసాయ మోటార్లను స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఎం జయరామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ జలకళ ద్వారా రైతులకు పంటలు సాగు చేసుకొనేందుకు వ్యవసాయం సులభతరం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి యాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, తలార్లపల్లి సర్పంచ్ కిష్టం ఏడుకొండలు, ఏపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

నూజెండ్ల, ఫిబ్రవరి 7: మండలంలోని ములకలూరు, పువ్వాడ పంచాయతీ ల పరిధిలో లబ్ధిదారులకు నూతన ఆరోగ్యశ్రీ కార్డులను ఎంపీడీవో టీ వీరభద్రాచారి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లా డుతూ రూ.20 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించటం ప్రయోజనం అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రవి కుమార్, సీహెచ్‌వోలు మస్తాన్ వలి, పఠాన్ మహబూబ్ సుభానీ, ఏఎన్ఎంలు మహాలక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్

బొల్లాపల్లి, ఫిబ్రవరి 7: బొల్లాపల్లి, మండలంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2022 - 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ విడత సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం జిలానీ బాషా బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి గ్రామాల్లో పనుల తనిఖీకి వెళ్ళనున్నారన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

వినుకొండటౌన్, ఫిబ్రవరి 7: పట్టణంలోని ఏనుగుపాలెం రైల్వే గేటు సమీపంలో మక్కెన వెంకటసుబ్బయ్య రైస్ మిల్ వద్ద గుండె జబ్బుల వ్యాధులపై ఉచిత మెగా క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మక్కెన మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 7: ముందు వెళ్తున్న లారీని వెనుక వైపు నుంచి మరొక లారీ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన పట్టణంలోని శివయ్యస్థూపం సెంటర్లో బుధవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలను పరిశీలిస్తే.. గుంటూరు నుంచి కర్నూలు ప్రయాణిస్తున్న లారీలు శివయ్యస్థూపం సెంటర్ వద్దకు రాగా ముందు ప్రయాణిస్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొనడంతో లారీ డ్రైవర్ వినయ్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వినయ్‌ను వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 7: నకరికల్లు మండలం చీమలమర్రి గ్రామంలో అక్రమంగా 26 మద్యం సీసాలను కలిగి ఉన్న కేసులో ఆర్ చరణ్‌ను అరెస్టు చేసినట్టు బుధవారం నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నయనతార తెలిపారు. నిందితుడి నుంచి తెలంగాణా రాష్ట్రానికి చెందిన 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని, అతడిని కోర్టులో ప్రవేశ పెట్టనున్నట్టు ఆమె తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన గండిగనుముల గ్రామవాసులు

బొల్లాపల్లి, ఫిబ్రవరి 7: బొల్లాపల్లి, మండలంలోని గండిగనుములకు చెందిన 20 కుటుంబాలు మంగళవారం రాత్రి జయహో బీసీ సభలో పల్నాడు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సమక్షంలో 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గోపీనాయక్, చిన కోటానాయక్, సోమానాయక్, కోటేశ్వరరావు నాయక్, గూండ్యానాయక్, కొండా నాయక్, కాలానాయక్, కొమరం ఏడుకొండలు, పెద కోటానాయక్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఈవోగా వెంకటేశ్వర్లు నియామకం

నరసరావుపేట, ఫిబ్రవరి 7: పల్నాడు జిల్లా డీఈవో కే శ్యామ్యూల్‌ను బదిలీ చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం వెంకటేశ్వర్లు డీఈవోగా నియమితులయ్యారు. శ్యామ్యూల్‌ను కర్నూలు డీఈవోగా బదలీ చేశారు.

తురుమెళ్ళలో కొనసాగుతున్న పోలీసు పికెట్

రొంపిచర్ల, ఫిబ్రవరి 7: మండలంలోని తురుమెళ్ళ గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతుంది. బుధవారం రొంపిచర్ల పోలీసుస్టేషన్ సిబ్బంది బందోబస్తును నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పాల్‌రాజ్ తెలిపారు.

మాతృ మరణాలపై కలెక్టర్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 7: పట్టణంలోని కలెక్టరేట్‌లో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందన హాల్లో బుధవారం పల్నాడు జిల్లా స్థాయి మాతృ మరణాలపై రివ్యూ నిర్వహించారు. రివ్యూకుకలెక్టర్ లోతేటి శివశంకర్ అధ్యక్షత వహించారు. మాతృ మరణాలకు గల కారణాలను విచారించి సూచనలు, సలహాలు ఇచ్చారు. మాతృ మరణాలను నివారించటానికి గర్భిణుల్లో హిమోగ్లోబిన్ పెంచేందుకు హెల్త్‌క్లబ్‌లను ఏర్పాటు చేసి రక్తహీనతను నివారించటానికి తీసుకోవాల్సిన చర్యలను, పోషకాహారం, యోగా తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. మాతృ మరణాలు సంభవించిన గర్భిణుల కార్డులను పరిశీలించారు. మాతృ మరణాలు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రివ్యూలో మాతృ మరణాలు సంభవించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన చంద్రాజుపాలెం, నాదెండ్ల, యడ్లపాడు, దుర్గి సిబ్బంది, ప్రైవేట్ ప్రభుత్వ గైనకాలజిస్టులు, డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, గీతాంజలి, డాక్టర్ మంత్రునాయక్, డాక్టర్ బీవీ రంగారావు, డాక్టర్ వసంత రాయ, డాక్టర్ వెంకటరావు, లక్ష్మీకుమారి, శిరీష్, బుచ్చిబాబు, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

9న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 7: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 9వ తేదీన ఒకటి నుంచి 19 సంవత్సరాల బాల బాలికలకు ఉచితంగా అల్‌బెండజోల్ మాత్రలను ఇవ్వనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ రవి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో, పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించన్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టర్ లోతేటి శివశంకర్, గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజరాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

నియమాలు పాటించి ప్రమాదాలు నివారించాలి

● ఎస్పీ రవి శంకర్‌రెడ్డి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 7: రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలు నివారించాలని ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. పట్టణంలోని ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గత నెల 20వ తేదీ నుంచి ఈనెల 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా ఆయన బుధవారం ఎస్పీ కార్యాలయంలో జెండా ఊపి రోడ్డు భద్రత అవగాహన ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలను నడపటం, విశ్రాంతి లేకుండా ఎక్కువ దూరం నడపటం, వ్యతిరేక దిశలో ప్రయాణించటం, హెల్మెట్, సీటు బెల్టు ధరించక పోవటం, అతివేగం, యూటర్న్ తీసుకొనే సమయంలో చుట్టూ ఉన్న వాహనాలను గమనించక పోవటం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాఘవేంద్ర, రామచంద్రరరాజు, ఎస్‌బీ సీఐ ప్రభాకర్, ఆర్ఐ వెంకటరమణ, రవి కిరణ్, రమణారెడ్డి, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన చిలకలూరిపేట పట్టణ ఎస్ఐ



ఎస్పీకి పూలమొక్క అందజేస్తున్న చిలకలూరిపేట పట్టణ ఎస్ఐ పుల్లారావు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 7 : పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డిని చిలకలూరిపేట పట్టణ ఎస్ఐ జీ పుల్లారావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పూలమొక్కను అందజేశారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో పుల్లారావు చిలకలూరిపేట పట్టణ ఎస్ఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం పాటు పడాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలన్నారు. ప్రజల రక్షణ, భద్రత కోసం కృషి చేయాలన్నారు. విజుబుల్ పోలీసింగ్‌ను పెంచాలని సూచించారు.

అంకితభావంతో కృషిచేస్తే సత్ఫలితాలు పొందవచ్చు

● డీవై ఈవో వేణుగోపాలాచారి

కారుమంచి(శావల్యాపురం), ఫిబ్రవరి 7: పాఠశాలలలో ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేస్తే విద్యార్థుల నుంచి సత్ఫలితాలు రాబట్టవచ్చని డీవైఈవో కె.వేణుగోపాలాచారి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మండలంలోని కారుమంచి జడ్పీ పాఠశాలలో ఆయన బుధవారం తనిఖీలు నిర్వహించారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న బోజన పథకం తదితర అంశాలను పరిశీలించారు. డీవైఈవో మాట్లాడుతూ 9, 10 విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించాలని, 8వతరగతి విద్యార్థులు బైజ్యూస్ ట్యాబ్‌లను సద్వినియోగిం చుకునేలా పర్యవేక్షించాలని, మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వ మెనూను పాటించే లా పర్యవేక్షణ చేయాలని సూచించారు. హెచ్ఎం ఉమామహేశ్వరరావు, ప్యానల్ సభ్యులు సుభాషిణి, అన్నపూర్ణమ్మ, హరికృష్ణ, శంకర్రావు, నరసింహారావు, శ్రీరాములు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో అధిక దిగుబడులు

● జిల్లా అధికారి కె.అమలకుమారి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 7: రైతులందరూ ప్రకృతి వ్యవ సాయ విదానాలను అవలంబించడం ద్వారా అతి తక్కువ పెట్టుబడి తో అధిక దిగుబడులు సాదించవచ్చన్నారు. నరసరావుపేట మండ లం అల్లూరివారిపాలెంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో ఏటీఎం మోడల్, సూర్య మండలం, డ్రాట్ ప్రూఫ్ మోడల్, ఏ గ్రేడ్ మోడల్, తదితర పద్ధతులను అనుసరించి రైతులు పండిస్తున్న ప్రకృతి వ్యవ సాయ పంటలను బుధవారం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ (ఈడీ) జి. వెంకటనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి, జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి కె.అమలకుమారి, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త గంగా భవాని, హోమ్ సైన్స్ దీప, సౌజన్య లక్ష్మీ తదితరులు పరిశీలించారు. రైతులకు డ్రై సోయింగ్ విత్తనాల కిట్‌లను అందజేశారు.